నవతెలంగాణ

నల్లగొండ

1

శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

నవతెలంగాణ -వేములపల్లి



మండలాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ పుట్టల సునీత కృపయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను ఎదురుకోవడానికి అయా శాఖల అధికారులు అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరా, అంటు రోగాలు, రైతులకు విత్తనాలు ఎరువులు వంటి అంశాలలో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ వెంకటయ్య, వైస్ ఎంపీపీ పాదురు గోవర్ధన శశిధర్ రెడ్డి ,ఎంపీటీసీలు చల్లబట్ల చైతన్య ప్రణీత్ రెడ్డి, నంద్యాల శ్రీరామ్ రెడ్డి, పల్ల వీరయ్య, మేక లలిత,రాములమ్మ, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి చేయూతనందించండి

నవతెలంగాణ -నకిరేకల్



ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి గ్రామాలలోని ప్రతి పౌరుడు చేయూతనందించాలని ఎంపీపీ బచుపల్లి శ్రీదేవి గంగాధర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నోముల, పాలెం, వల్లభాపురం, ఓగోడు గ్రామాలలో విద్యార్థులకు యూనిఫాంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్థానిక నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రైతులకు కొత్త రుణాలు వెంటనే ఇవ్వాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరెపల్లి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మిర్యాలగూడ

రైతులకు కొత్త రుణాలు వెంటనే ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరెపల్లి వెంకటేశ్వర్లు కోరారు. రైతులకు రుణాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అవంతిపురం కెనరా బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిందని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితిని పెంచి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన రైతులకు రెండు లక్షల రుణమాఫీని ప్రతి రైతుకు వర్తించే విధంగా వెంటనే మాఫీ చేయాలని కోరారు. కొత్త రుణాలు ఇవ్వని కారణంగా రైతులు ప్రైవేటు ఫైనాన్స్ వ్యక్తులను ఆశ్రయించి అధిక వడ్డీకి డబ్బులు తెచ్చుకొని ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని వెంటనే అమలు చేస్తూ వెంటనే కొత్త రుణాలు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవినాయక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాగిరెడ్డి మంగారెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శి పోలేపల్లి గోవిందరెడ్డి, కోట్ల శ్రీనివాసరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చౌగాని వెంకన్న, వీరారెడ్డి, నాగేశ్వరావు, లింగయ్య, ఆశీర్వాదం,రవి, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం



నవతెలంగాణ-చండూరు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. శుక్రవారం గట్టుప్పల మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలు వచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ కూలీలకు రూ.12,000, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, కౌలు రైతులకు వాన కాలం నుంచి రైతు భరోసా అమలు చేయాలన్నారు. పంటల బీమా పథకం రైతాంగానికి ఉపయోగపడే విధంగా భీమా ప్రీమియాన్ని ప్రభుత్వం భరించి అమలు చేయాలన్నారు. ఆగస్టు లోపు రెండు లక్షల లోపు ఉన్న రుణాలు వెంటనే రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగానే ధాన్యానికి ఇతర పంటలకు బోనస్ ఇవ్వాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాళీ పోస్టులు అన్నిటిని భర్తీ చేయాలని, వేసవిలో ఉపాధి పనులు చేసిన కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య, మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, ఖమ్మం రాములు,వల్లూరి శ్రీశైలం, మండల నాయకులు కర్నాటి తుకారం, పెదగాని నరసింహ, టేకుమట్ల కృష్ణ, శ్రీరాముల వెంకటేశం, పర్సబోని యాదగిరి, చిక్కుల సైదులు, ఆకారపు వెంకటేశం,రేవెల్లి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో భారీగా నగదు పట్టివేత

- మిర్యాలగూడకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



నవతెలంగాణ-నల్లగొండడెస్క్

ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.28 కోట్ల నగదును నల్లగొండ జిల్లా రైల్వేపోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడకు చెందిన బంగారం వ్యాపారి హైదరాబాద్‌లో బంగారం కొనుగోలు చేసేందుకు మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు రెండు బ్యాగుల్లో నగదును తీసుకెళ్తున్న క్రమంలో నల్లగొండ రైల్వేస్టేషనలో ఆర్‌పీఎఫ్, రైల్వేపోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మిర్యాలగూడకు చెందిన బంగారం వ్యాపారి తన వర్కర్‌తో కలిసి గురువారం ఫలక్‌నుమా రైల్‌లో నగదుతో హైదరాబాద్ వెళ్త న్నాడు. ఈ క్రమంలో వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారి బ్యాగులను తనిఖీ చేయగా అందులో రూ.1,28,41,800 కోట్ల వరకు నగదు ఉన్నట్లు గుర్తించారు. ఐటీ అధికారుల సహాయంతో నగదును నల్లగొండ రైల్వేస్టేషనలో లెక్కించారు. ఈ నగదును ట్రెజరీ కార్యాలయానికి తరలించి అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ నగదు విషయానికి సంబంధించి తదుపరి కార్యాచరణ ఉండడంతో వివరాలు వెల్లడించేందుకు ఆలస్యం అవుతుందని తెలిపారు. అయితే మిర్యాలగూడలో బంగారం దుకాణాల మధ్య ఉన్న పోటీతత్వంతో ఇతర వ్యాపారులు ఇచ్చిన సమాచారం మేరకు నగదును ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. మిర్యాలగూడకు చెందిన వ్యాపారి మహేందర్, పరమేషకు చెందిన నగదుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

నారాయణ పాఠశాలలో ధర్నా

- పుస్తకాలు అమ్ముతున్న గదిని సీజ్
- బీసీ సంఘం నాయకులు తిరుమలగిరి అశోక్

నవతెలంగాణ-మిర్యాలగూడ



పట్టణంలోని నారాయణ పాఠశాలలో విద్యార్థుల దగ్గర నుండి ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్, అడ్మిషన్ ఫీజుల పేరిట పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పుస్తకాలు అమ్ముతున్నటువంటి నారాయణ పాఠశాల గదిని సీజ్ చేయించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ పట్టణంలోని నారాయణ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు నారాయణ విద్యాసంస్థలతో ములాకత్ అవ్వడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో యూనిఫార్మ్, పుస్తకాలు, అత్యధిక ఫీజులు, అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాల యాజమాన్యాలకు తొత్తులుగా మారి విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక శోభకు గురిచేస్తున్నారని చెప్పారు. విద్యాశాఖ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న నారాయణ పాఠశాల గదిని బీసీ సంఘం నాయకులు ఆందోళన చేసి సీజ్ చేయించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్, వెంకటేష్ గౌడ్, తాళ్లపల్లి సురేష్, ఆర్లపూడి శ్రీను, చిలకల మురళి యాదవ్, సిద్ధం రాజు, గంగాధర్, ఉపేందర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలను ప్రోత్సహించిన సినిమాటోగ్రఫీ నైపుణ్యాలు

- కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం
- త్వరలో 90 కోట్లతో సాంస్కృతిక కేంద్రం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



రాష్ట్రంలోనే కాకుండా దేశంలో నే మొట్టమొదటిదిగా100 మంది అమ్మాయిలను సినిమాటోగ్రఫీ సంబంధిత నైపుణ్యాలను నేర్చుకోవడానికి ప్రోత్సహించిందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాల, చర్లపల్లిలోని ఎస్సీ, ఎస్టీ విభాగానికి చెందిన 100 మంది అమ్మాయిలకు సినిమాటోగ్రఫీ నైపుణ్య శిక్షణ కోర్సులు నిర్వహించిన నీలగిరి నిపుణ ప్రోగ్రాం సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాల ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ప్రారంభమై ఏప్రిల్ 2024 వరకు సాగిన 45 రోజుల కోర్సు థియరీ, ప్రాక్టికల్ శిక్షణ రెండు అందించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వెంకట్ రెడ్డి, కలెక్టర్ హరి చందన , ఎస్పీ దీప్తి చందన, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస రెడ్డి, స్పేస్ అకాడమీ చైర్మెన్ శశి ప్రీతం, నటుడు వైభవ్ సూర్య హజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని డబ్బింగ్, యాంకరింగ్ విద్యార్థులు జయశ్రీ, శ్రుతి నిర్వహించగా, సినిమాటోగ్రఫీ విద్యార్థులు శ్రుతి, ఆమె బృందం కెమెరా కవరేజీ నిర్వహించారు. రుద్రవరం పల్లవి, ప్రణతి, ఇతర విద్యార్థులు అతిథుల ముందు తమ అనుభవాలను గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల ఐటి మంత్రి శ్రీధర్ తో కలిసి అమెరికా పర్యటనలో, అభివృద్ధి చెందిన దేశాలు నైపుణ్య అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాయన్నారు. ఇది జీవితంలో విజయం, స్థిరపడే గమ్యంగా ఉన్నందన్నారు. సినిమాటోగ్రఫీ వంటి నైపుణ్యాలను నేర్చుకోవడానికి మరింత మందివిద్యార్థులను ప్రోత్సహించడానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ నల్గొండ చుట్టూ ప్రత్యేకంగా 15 కిమీ రింగ్ రోడ్, క్లాక్ టవర్ సర్కిల్ వద్ద రూ. 90 కోట్లు ఖర్చుతో సాంస్కృతిక కేంద్రం వంటి ప్రాజెక్టులు త్వరలో రాబోతున్నాయని తెలిపారు. కలెక్టర్ హరి చందన మాట్లాడుతూ, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా నైపుణ్య అభివృద్ధి కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఆయన సినిమాటోగ్రఫీ పోర్ట్‌ఫోలియోను నిర్వహిస్తున్నందున, ఈ నైపుణ్యాలను ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలకు నేర్పడానికి ఈ కార్యక్రమం వెంటనే చేపట్టబడిందని తెలిపారు. స్పేస్ అకాడమీ చైర్మెన్ శశి ప్రీతం మాట్లాడుతూ, మంత్రి, కలెక్టర్ నిర్ణయించిన లక్ష్యాలను సాధించడానికి విద్యార్థులను మార్గనిర్దేశం చేయడం, నైపుణ్యాలలో నిపుణులుగా తీర్చడం అనేది బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అలాగే, శిక్షణా కాలంలో విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌లు, అడ్వాన్స్‌డ్ లెర్నింగ్, కెరీర్ కౌన్సెలింగ్‌లతో సహకరించడానికి సపోర్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఆవనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, డీఆర్ఓ రాజ్య లక్ష్మీ, డీఆర్‌డీపీ పీడీ నాగిరెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వరరావు,ఆర్డీఓ రవి, నల్గొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపోలో లక్షే లక్ష్యం ఛాలెంజ్

నవతెలంగాణ -దేవరకొండ

దేవరకొండ ఆర్టీసీ డిపోలో లక్షే లక్ష్యంగా చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్టీసీ కళా జాత కళాకారుల బృందం ఆట పాటలతో సంస్థ ఉద్యోగులను ఉత్తేజపరిచారు. ఆదాయం తెచ్చే విధంగా పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం స్థానిక బస్ స్టేషన్‌లో మహాలక్ష్మి స్కీంను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని,ఆధార్ కార్డు అప్డేట్ చేసుకుని ఉచిత ప్రయాణం చేయాలని కళా ప్రదర్శనలో కోరారు. ఈ సందర్భంగా డిపో ఇన్‌చార్జి మేనేజర్ బొల్లెద్దు పాల్ మాట్లాడుతూ సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి ఆర్టీసీ కట్టుబడి ఉందని, కష్టపడి పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. మేనేజర్ పడాల సైదులు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు సురక్షిత ప్రయాణం చేయవచ్చన్నారు. అనంతరం కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ సునీత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వాహీదుద్దీన్, వెల్ఫేర్ బోర్డు మెంబర్స్ రాంకోటి, పాండురంగచారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు ఆన్‌లైన్

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల రైతులు నుండి వచ్చిన ధరణి దరఖాస్తులను రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ జి.శ్రీనివాస్ రావు సమక్షంలో ఆన్ లైన్ చేస్తున్నారు. మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల రైతులు వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సుమారు 8,572 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి అంతా తప్పుల తడకగా ఉందని ఆరోపణలున్నందున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పలువురు దరఖాస్తు చేసుకున్నారు. రైతుకు సంబంధించిన భూమి పట్టాదారు పాసుపుస్తకాలలో లేకపోవడం, ఎక్కువ, తక్కువ చూపడం, పేర్లు తప్పు ఉండటం, భూమి మాయమవడం, సర్వే నంబర్లు ఉన్న భూమి లేకపోవడం, భూమి ఉన్న సర్వే నెంబర్లున్న భూమి లేకపోవడం, నిషేధిత భూములుగా చూపడం తదితర సమస్యలపై ఎన్నికలకు ముందు దరఖాస్తు చేసుకున్న సుమారు 2,000 రైతుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి జిల్లా కలెక్టరేట్ కు పంపించారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా కలెక్టరేట్‌లో ఆన్ లైన్ చేయలేదు. తిరిగి వాటిని మిర్యాలగూడ డివిజన్ కార్యాలయానికి పంపారు. మిర్యాలగూడ రెవిన్యూ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్ లైన్ చేసే పనులు రెండు కంప్యూటర్లలో చేపట్టారు. వారం రోజుల్లో దరఖాస్తులను ఆన్ లైన్ చేస్తామని ఆర్డీఓ తెలిపారు.

పంప్కిన్ ప్యాచ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు అభినందనయం

- మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-నల్గొండడెస్క్

నలగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పంప్కిన్ ప్యాచ్ ఇంటర్నేషనల్ స్కూల్ ను శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంప్కిన్ ప్యాచ్ ఇంటర్నేషనల్ స్కూల్ జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలిపారు. నల్గొండలో మొదటిసారిగా ఇంటర్నేషనల్ పాఠశాల ఏర్పాటు చేయడం వలన పట్టణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. చిన్నపిల్లలకు మెరుగైన వసతులతో పాటు చిన్నతనంలోనే పాఠశాలను ఆకర్షించే విధంగా పాఠశాలలో ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ హరీన్ మాట్లాడుతూ 2 నుండి 6 సంవత్సరాల పిల్లలకు మా క్యాంపస్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సెన్సరీ ప్లే, ఫోనెమిక్ అవేర్‌నెస్, విజువల్ పర్సెప్షన్ వయస్సుకి తగిన లెర్నింగ్‌ని అందిస్తున్నామని తెలిపారు.క్యాంపస్‌లో ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతులను అందిస్తూ పాఠశాల తర్వాత కార్యకలాపాలను కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్ గౌడ్, 39 వ వార్డు కౌన్సిలర్ దాసరి సాయికుమార్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దవూర



నాగార్జున సాగర్ నియోజకవర్గంలో మిగిలిన పోయిన పనులన్నీ పూర్తి చేసి ఇంకా అభివృద్ధి పథం లోకి తీసుకెళ్తానని సాగర్ శాసన సభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గిరిజన చైతన్య యాత్ర చెప్పట్టి ఏడాది పూర్తి అయిన సందర్భంగా మండలంలో ఉట్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరణ చేసి అనంతరం జరిగిన సమ్మెళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.గతేడాది ఇదే రోజున గిరిజన చైతన్య యాత్ర గేమ్యానాయక్ తాండ నుంచి ప్రారంభించి నియోజకవర్గం 200 పైగా తండాలలో పాదయాత్ర చేపట్టామని తనకు సహకారం అందించిన వారందరికీ ఎంతో రుణపడివున్నానన్నారు. నియోజవర్గంలోని ప్రతి గిరిజన తండాను తిరుగుతూ గిరిజనులను చైతన్య పరుస్తూ ముందుకు సాగిన విషయం మీకందరికి తెలిసిందేనన్నారు.మండలంలో అన్నీ వర్గాల ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. మళ్ళీ నియోజకవర్గంలోనే ఉన్న గిరిజన తండాలను మమేకం చేస్తూ జరగబోయే స్థానిక సంస్థల ఎలక్షన్ లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేస్తామని ఉన్నారు. మండల అధ్యక్షులు పబ్బు యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ ర్యక్రమంలో మాజీ జెడ్పి వైస్ చైర్మెన్ కర్నాటి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మల పల్లి చంద్ర శేఖర్ రెడ్డి,మాజీ ఎంపీపి రమావత్ శంకర్ నాయక్, వాసుదేవుల రవీందర్ రెడ్డి,బీరెడ్డి బాల్ రెడ్డి, గడ్డం పల్లి వినయ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు కిలారి మురళీ కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పెండింగ్ పనులపై విచారణ

నవతెలంగాణ-శాలిగౌరారం



మండలకేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి నల్లగొండ క్లస్టర్ పీడి, నకిరేకల్ ఏపీడి గత ఆడిట్లో చేసినఉపాధి హామీ పనుల అక్రమాలపై శుక్రవారం రికవరీల గురించి సమీక్ష చేశారు. ఈ సమీక్షలో జిల్లా అధికారి మండల ఉపాధి హామీ పనుల గురించి అడగగా ఉపాధి హామీ పనులు పూర్తి చేయకపోవడంపై మండల సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. గత 12వ, 13వ విడత సామాజిక తనిఖీలో వెల్లడైన పెండింగ్ పనులు నేటికీ పూర్తికాలేదు. మూడు సంవత్సరాల క్రితం పెండింగ్లో ఉన్న నేమ్ బోర్డ్స్ నేటికీ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. పనులు పెండింగ్లో ఉన్నాయని వారపు రోజుల్లో పూర్తి చేయిస్తానని విచారణ అధికారిగా వచ్చిన నల్గొండ క్లస్టర్ డీఆర్‌డీఏ పీడీ ఉపేందర్ రెడ్డి తెలిపారు.పనులను పూర్తి చేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ క్లస్టర్ ఏపీ డి నరసింహారావు, శాలిగౌరారం ఎంపీడీవో రేకల లక్ష్మయ్య, ఏపీ ఓ జంగమ్మ ఈసీ వెంకటాచారి పాల్గొన్నారు.

బండి డిక్కీ నుంచి రూ.80వేలు చోరీ

- రోధిస్తున్న బాధితులు

నవతెలంగాణ-నల్లగొండడెస్క్

జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజారులో ఘరానా దొంగలు శుక్రవారం చెలరేగిపోయారు. పిల్లల చదువుకోసం తిప్పర్తి మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన కూలీ గుండె వెంకన్న తన సెంట్రల్ యూనియన్ బ్యాంకులో నుంచి రూ.80 వేల విత్ డ్రా చేసుకొని బైక్ డిక్కీలో భద్రపరిచాడు. తన కూతురు కోసం బ్యాగ్ తీసుకుందామని బైక్ పక్కన ఆపి షాప్ లోకి వెల్లాడు. అతని బైక్ వద్ద ఇద్దరు వ్యక్తులు గొడుగు అడ్డం పెట్టి తన బైక్ డిక్కీ లాక్‌ని పగలగొట్టి రూ.80 వేల చాకచక్యంగా కొట్టేశారు. వెంటనే తన కూతురు డయల్ 100కి కాల్ చేసింది. స్పందించిన పోలీసులు అక్కడి స్థానిక వన్ టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శంకర్ వారి సిబ్బంది స్థలానికి చేరుకొని దొంగతనం చేసిన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీసీ ఫుటేజిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. డబ్బు కోల్పోయిన బాధితులు రోదన మిన్నంటింది.



కుంచం పాపయ్య మృతికి సంతాపం

నవతెలంగాణ -నకిరేకల్



మండలంలోని నోముల గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుంచం పాపయ్య అకాల మృతి చెందారు శుక్రవారం ఎంపీపీ బచుపల్లి శ్రీదేవి గంగాధరరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట గ్రామ మాజీ సర్పంచ్ కుంచం రమణమ్మ సోమయ్య, ఎంపీటీసీ సామ మల్లమ్మ, పిఎసిఎస్ డైరెక్టర్ సామ సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు సామ రవీందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కనుకుల సంతోష్ రెడ్డి, నర్సింగ్ వెంకన్న, అలకుంట్ల వెంకన్న ఉన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-శాలిగౌరారం



మండలం పరిధిలోని వల్లాల ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు డిసెంబర్ 10వ తేదీన నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దండెంపల్లి నికేష్ , పాక శ్రీవిద్య అర్హత సాధించారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాగిణి శుక్రవారం తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి, వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవితో పాటు ఉపాధ్యాయులు శీలం భద్రయ్య, గోగుల శ్రీనివాస్, వేణు, అనిత, సహన, మాయ, సహన, జ్యోతి అభినందించారు.

అనురాగ్ కళాశాలలో 'సర్కార్ శివ' షూటింగ్



నవతెలంగాణ-కోదాడరూరల్

శ్రీ రాఘవేంద్ర స్వామి ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్ సమర్పణలో బుడిగం నరేష్ కుమార్ (నాని) రొడ్డవేని శ్రీనివాస్ ప్రొడ్యూసర్లుగా నిర్మిస్తున్న సర్కార్ శివ షూటింగ్ అనంతగిరి గ్రామ శివారులోని అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో చిత్రీకరణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకల్ కళాకారులు ప్రోత్సహిస్తున్నటువంటి అనురాగ్ కాలేజీ యాజమాన్యానికి ప్రొడ్యూసర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హీరో కాసాని శివ, హీరోయిన్ మేఘన, నటులు ప్రభాకర్ రావు, మల్లికార్జున్, సత్యనారాయణ, సాయి మైనారిటీ సైదయ్య శ్రీ లక్ష్మీ రాకేష్ శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ రక్త దాతల దినోత్సవం

నవతెలంగాణ-మేళ్లచెరువు



ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తిరుమల హాస్పిటల్స్ కోదాడ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్లాంట్ హెడ్ మరియు ప్రెసిడెంట్ వర్క్స్ యస్.శ్రీనివాసరావు పాల్గొని రక్త దానము చేసారు, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రక్త దానం సామజిక బాధ్యత అని, ఆపదలో వున్న వారి ప్రాణాలు కాపాడుతుంది అని అన్నారు, రక్త దానం సామజిక బాధ్యత అని అయన తెలిపారు. ఈ కార్యక్రము లో పర్సనల్ జి యం డాక్టర్ నాగేశ్వరావు, డాక్టర్ సాయి కిరణ్, హెల్త్ ఆఫీసర్ శ్రీను, ఏ జి యం శ్రీనివాస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- వాటివల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి
- 30 రోజుల్లో డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చాలి
- విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులతో పాటూ ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలి

జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని కలెక్టర్ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టవలసిన చర్యలపై జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. మాదక ద్రవ్యాల వినియోగం పట్ల కలిగే నష్టాలను యువతకు అవగాహన పరిచేందుకు విస్తృత ప్రచారం కల్పించి, సూర్యాపేట జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చాటానికి సంబంధిత అధికారులు అందరూ క్రుషి చెయాలన్నారు. జిల్లాలో ఉన్న విద్యాసంస్థల్లో విద్యార్థుల అలవాట్లను, నడవడిని పరిశీలించాలని మాదకద్రవ్యాల వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించాలని అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తన అలవాట్లను గమనిస్తూ ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలను తెలంగాణ సాంస్కృతిక సారధులు 12 మండలాలలో, పోలీస్ కళాబృందాలు 11 మండలాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, దీనిలో మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం జూవైనల్ యాక్ట్ పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులకు ఆశా, అంగన్వాడీలు, ఏఎన్ఎం లు బృందాలుగా ఏర్పడి మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను ముందుగా తల్లిదండ్రులకు తెలపాలని కలెక్టర్ పేర్కొన్నారు. మొదటి 15 రోజులు మండల కేంద్రాలలో తరువాత మున్సిపాలిటీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ జిల్లాలోని చెక్ పోస్ట్ ల వద్ద వాహనాలను చెక్ చేయాలని డ్రగ్స్ గంజాయి వంటి పదార్థాల రవాణాను అరికట్టటానికి ఆర్టిఐ అధికారులు,ఎక్సైజ్, పోలీసు అధికారులు అన్ని చెక్ పోస్ట్ ల వద్ద పటిష్టంగా చెక్ చేయాలి అన్నారు. పశువుల రవాణా నియంత్రించేందుకు చెక్ పోస్ట్ ల వద్ద పశు సంవర్ధక శాఖ అధికారులను నియమించాలని ఎస్పీ తెలిపారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా దగ్గు మందులు ,మత్తు నిచ్చే మందులను ఇవ్వకూడదని ఎస్పీ తెలిపారు. అన్ని పాఠశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలు సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు డ్రగ్స్, మాదకద్రవేయాల పట్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సతీష్ కుమార్, జెడ్పి సీఈవో వి వి అప్పారావు, డి ఆర్ డి ఓ మధుసూదన్ రాజు, డిఎం అండ్ హెచ్ ఓ కోటాచలం, ఆర్డీవోలు సూర్యాపేట వేణుమాధవ్, కోదాడ సూర్యనారాయణ, సి సెక్షన్ సూపర్డెంట్ శ్రీనివాసరాజు, డిపిఓ సురేష్ కుమార్, డీ డబ్ల్యూ ఓ వెంకటరమణ, డిఇఓ అశోక్, డి ఐ ఈ ఓ కృష్ణయ్య, ఆర్టీవో ఎక్సైజ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించండి

- సీపీఐ(ఎం) 8వ వార్డు కౌన్సిలర్ కొదమగుండ్ల సరిత

నవతెలంగాణ-నేరేడుచర్ల



ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులని చేర్పించాలని తద్వారా విద్యా వ్యవస్థని బలోపేతం చేయాలని సీపీఐ(ఎం) 8వ వార్డ్ కౌన్సిలర్ కొదమగుండ్ల సరిత అన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకొని ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వపాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను బోధిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలతో పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఉచిత పుస్తకాలు ఉచిత దుస్తులు ఇస్తూ నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలో అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనసూర్య ఉపాధ్యాయురాలు వహీదా తల్లిదండ్రులు పత్తిపాటి అశోక్, ఆవుల శ్రీను, బొడ్డు మంచి ఏప్సీబా పాల్గొన్నారు.

మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు

మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శీలం శ్రీను

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌టౌన్



రాష్ట్రంలో గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శీలం శ్రీను విమర్శించారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ చేయడం మూలాన అందులో కాంట్రాక్టర్లు ఎక్కువ బాగుపడ్డారని అన్నారు. సొసైటీలకు నాణ్యమైన సీడ్ ఇవ్వకుండా నాసిరకం సరుకు అందజేశారని దీంతో దిగుబడి రాక మత్స్య శాఖ సొసైటీలు తీవ్రంగా నష్టపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీలకు చేప పిల్లల బదులు సొసైటీ ఖాతాలలో నగదు రూపంలో జమ చేయాలని కోరారు. నగదు అందజేయడం వల్ల సొసైటీ సభ్యులు నాణ్యమైన సీడ్ కొనుగోలు చేసి దిగుబడులు సాధించి లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించాలని కోరారు.

ప్రయివేట్ విద్యాసంస్థల ఫీజు నియంత్రణకు చట్టం తీసుకురావాలి

- ప్రభుత్వ పాఠశాలల హాస్టల్స్‌ని తెరవాలి
- పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు డిమాండ్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు నియంత్రణకు చట్టం తీసుకురావాలని, ప్రభుత్వ విద్యను పరిరక్షించి మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను, హాస్టళ్లను తెరిచి మౌలిక వసతులు కల్పించాలని పిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్ఎఫ్ సూర్యాపేట జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థలు ప్రారంభమైన కూడా ప్రభుత్వం ఇంకా కమిటీలు, పరిశీలన అంటూ ప్రకటనలతో సరిపెట్టడమేంటని ప్రశ్నించారు. విద్యారంగానికి సరిపడ నిధులు లేక అనేకమైన సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూసివేసిన పాఠశాలలు,హాస్టళ్లను మేము ప్రారంభిస్తామన్న ప్రభుత్వం ఎందుకు ప్రారంభించలేదు అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను తెరిపించి, ప్రత్యేకమైన నిధులు కేటాయించాలని,అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ విద్యను వ్యాపారికరించి లక్షలాది రూపాయలను వసూలు చేస్తున్నాయి. అధికారులు చూస్తూ పట్టించుకోక పోవడం వలన అదనంగా పాఠ్యపుస్తకాలు, నోట్, స్టేషనరీ, యూనిఫామ్, షుఉ, బెల్టు, బ్యాగుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని, ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకొచ్చి పటిష్టంగా అమలు చేసి అన్ని రకాల దోపిడిని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు జే.సాయికుమార్, ఎస్ నవీన్, ఉదయ్,విష్ణు, సిహెచ్ వేణు ప్రశాంత్,శివ, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా వైద్యం అందించడం సంతోషంగా ఉంది

- ప్రముఖ వైద్యురాలు బెల్లంకొండ ప్రియాంక



నవతెలంగాణ-చివ్వెంల

గ్రామీణ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందిచడం సంతోషంగా ఉందని ప్రముఖ వైద్యురాలు బెల్లంకొండ ప్రియాంక అన్నారు. సూర్యాపేటలోని ఆర్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూర్యాపేట వారి అధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అక్కలదేవి గూడెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ నూతన సాంకేతిక వైద్యంతో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలతో సూర్యాపేటలో మునుపెన్నడు లేని విధంగా ఆర్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో అత్యుత్తమ సాంకేతికలతో కూడిన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని పేద ప్రజలకు అన్ని రకాల పరీక్షలల్లో రాయితి ఇస్తామని వెల్లడించారు. వైద్య శిబిరానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, తండా వాసులు అధిక సంఖ్యలో హాజరై వైద్యులకు చూపించుకున్నారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ బి. క్రాంతి, బెల్లంకొండ రామూర్తి, పుట్ట వెంకటేశ్వర్లు, లోడే వెంకన్న, పొడిశెట్టి శ్రీకాంత్, నాగరాజు, హాస్పిటల్స్ సిబ్బంది ప్రశాంత్, సురేష్, నరేష్, సంజీవ పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం ఒక సాంప్రదాయం

- ఎంఈఓ గోపాల్ రావు

నవతెలంగాణ-చివ్వెంల



అక్షరాభ్యాసం అనేది సంప్రదాయాల ప్రకారం ఒక ఆచారమని ఈ కార్యక్రమం పిల్లల కోసం, వారి బంగారు భవిష్యత్తు కోసం సరస్వతి దేవికి నమస్కరించి అక్షరాలు దిద్దిస్తారని ఎంఈఓ గోపాల్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు విద్యాదీక్ష తీసుకోవడంతో పాటు, తద్వారా పిల్లవాడు అధికారిక విద్యను పొందేందుకు సిద్ధంగా తయారవుతాడని అందుకే పసి పిల్లలకి అక్షర అభ్యాసం చెపిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కళారాణి, సాయిరెడ్డి, ఉపాధ్యాయులు సుజాతదేవి, నిర్మల, వరలక్ష్మి పాల్గొన్నారు.

తెలంగాణా మలిదశ ఉద్యమకారులకు పెన్షన్ ఇవ్వాలి



నవతెలంగాణ-హుజూర్‌నగర్

ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు 50 ఏండ్లు నిండి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.5వేలు ప్రత్యేక పెన్షన్ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం హుజూర్నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాస అన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా ప్రత్యేక పొలిటికల్ జేఏసీగా ఏర్పడి వివిధ రంగాలలో ఉద్యమకారులను చైతన్యపరిచి సకలజనుల సమ్మె ఏర్పాటు చేసి అన్ని వర్గాల వారిని ఉద్యమంలోకి తీసుకొచ్చి ధూమ్ ధామ్ కార్యక్రమం ద్వారా ఉద్యమాన్ని ఉరుకలు వేయించిన వారు నేడు వయోభారంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు ఆయన తెలిపారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. రాష్ట్ర సాధన కోసంప్రాణాలు త్యాగం చేసిన ఉద్యమకారలు ఉన్నారన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి ప్రత్యేక నిధిని కేటాయించాలన్నారు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో 20 శాతం ఉద్యమకారులకు కేటాయించాలన్నారు. ఉచితంగా బస్సు సౌకర్యం హెల్త్ కార్డులను ఇవ్వాలన్నారు. ఉద్యమకారుల త్యాగాలను మరిచిపోయిన ప్రభుత్వాలను చరిత్ర సహించదన్నారు. ఉద్యమకారులకు తమ సంఘం అండగా ఉంటూ వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బొర్డు గోవిందరావు గడ్డం అంజి యాదవ్ హుజూర్నగర్ పట్టణ ప్రధాన కార్యదర్శి రాయల వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షుడు చేకూరి నరసింహ చారి కర్నే కృష్ణ శెట్టి శ్రీను మధు పాల్గొన్నారు.

న్యాయవాదులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలతో పాటూ సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఐలూ ఆధ్వర్యంలో నేడు, రేపు హైదరాబాద్‌లో నిర్వహించే న్యాయవాదుల రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతుల్లో జిల్లా నుండి అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా భాద్యులు వెజెల్ల రంగారావు, ఉయ్యాల నర్సయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టుల సముదాయంలో నిర్వహించే ఈ శిక్షణా తరగతుల్లో ఐలు జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ఎంపీ బీకాస్ రంజన్ భట్టాచార్య ప్రారంభిస్తారని వారు తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనే న్యాయవాదులు డెలిగేషన్ ఫీజు కింద రూ.200 చెల్లించాలని, వారికి వసతి, భోజన సౌకర్యాలు నిర్వాహకులు కల్పిస్తారని వారు తెలిపారు. న్యాయవాదులు తమ వృత్తిలో రాణించేందుకు ఉపయోగపడే ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా నుండి అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని వారు కోరారు.

స్కూల్ బస్ ఫిట్నెస్ టెస్ట్ నిర్వహించకపోతే చర్యలు :ఆర్టీఓ

నవతెలంగాణ-కోదాడరూరల్



స్కూల్ బస్సు ఫిట్నెస్ టెస్ట్ నిర్వహించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీవో జిలాని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని 189 బస్సుల్లో 150 బస్సులకు పైగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క స్కూల్ బస్సుకు ఫిట్నెస్ టెస్ట్ చేయించుకోవాలని తెలిపారు. ఫిట్నెస్ టెస్ట్ చేపట్టని స్కూల్‌లపై చర్యలు తీసుకుంటామని ఆర్టీవో జిలాని తెలిపారు.

శ్రీ సీతా మెమోరియల్ పాఠశాలకు నోటీసులు

- జారి చేసిన ఎంఈఓ సైదా నాయక్

నవతెలంగాణ-చింతలపాలెం

శ్రీ సీతా మెమోరియల్ పాఠశాలకు ఎంఈఓ సైదా నాయక్ నోటీసు జారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో గల శ్రీ సీతా మెమరీయల్ స్కూల్‌పై గత కొన్ని రోజులుగా వస్తున్న పత్రిక కథనాలపై ఎంక్వయిరీ నిమిత్తం సీతా మెమోరియల్ స్కూల్‌పై విచారణ నిర్వహించడం జరిగిందని, విచారణలో భాగంగా 2019లో సెక్షన్ బి అనుమతుల కోసం అసలు బ్లాక్-బి కి గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా ఫేక్ ఎన్ఓసీ తయారు చేయించి అనుమతులు పొంది స్కూల్ నిర్వహిస్తున్నారని తెలిపారు. పదిమంది చింతలపాలెం యువకులు లికిత పూర్వకంగా మండల విద్యాధికారికి కంప్లైంట్ ఇవ్వడంతో దీనిపై పూర్తి విచారణ నిమిత్తం మూడు రోజుల్లోగా 2019 ఎన్ఓసికు బ్లాక్-బి బిల్డింగ్ సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని, లేనిపక్షంలో శాఖ పరమైన చర్యలు ఉంటాయని సీతా స్కూల్ యాజమాన్యానికి నోటీసు ఇష్యూ చేశారు. ఫీజులు విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. అనంతరం మంగళవారం దీనిపై ఎంపీడీవో డిఈఓతో సమగ్ర విచారణ ఉంటుందని ఎటువంటి తప్పుదోవ పట్టకుండా విచారణ ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతా మెమోరియల్ పాఠశాల ప్రిన్సిపాల్ థామస్, తదితరులు ఉన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సూర్యాపేట

పట్టణంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6:30 గంటల నుండి 11:30 గంటల వరకు పట్టణ, సూర్యాపేట మండల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషన్ ఏడీఈ ఎల్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున రూరల్ మండల పరిధిలోని సూర్యాపేట టౌన్ 1, సూర్యాపేట టౌన్ 2, సూర్యాపేట రూరల్ గ్రామాలలోని కుప్పిరెడ్డిగూడెం, కేసారం, కాసరబాద్, ఇమాంపేట, కుసుమవారీగూడెం, పిల్లలమర్రి, సోలిపేట, రామచంద్రపురం, బాలెంల, దాసాయి గూడెం గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

- ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఎంఈఓకు వినతి

నవతెలంగాణ-తిరుమలగిరి



అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షులు పానుగంటి గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమలగిరి ఎంఈఓకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రయివేట్ స్కూళ్లలో విద్యా హక్కుచట్టం(2009)కి విరుద్ధంగా ప్రయివేట్ స్కూళ్ల యాజమాన్యాలు పిల్లలను మరియు వారి తల్లిదండ్రులను పీడిస్తూన్నారని, యూనిఫామ్, పుస్తకాలు మరియు షూలకు అధిక ఫీజులు వసూలు చేస్తుండడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతూ.. ఐఎన్‌టీయూసీ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కావున విచారణ జరిపి ప్రయివేటు స్కూల్ యజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల దాస్ రాజు, పరమేష్, నరేష్, ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల కోసం స్థలం పరిశీలన

నవతెలంగాణ-చింతలపాలెం



తహశీల్దార్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్తు కార్యాలయం, పోలీసు స్టేషన్ నిర్మాణం కోసం శుక్రవారం స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తహశీల్దార్ సురేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు తహశీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్తు కార్యాలయం, పోలీసు స్టేషన్ కొరకు స్థలం ఏర్పాటుకు గాను సర్వే నంబర్ 24 ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేసినారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరాల కొండారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గుజ్జుల నరేందర్ రెడ్డి, శివాలయం చైర్మన్ అంబటి రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఆరు గేదెలు మృతి

నవతెలంగాణ-కోదాడరూరల్

విద్యుద్ఘాతంతో 6 గేదెలు మృతి చెందిన ఘటన అనంతగిరి మండలం, కొత్తగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, యజమానులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో గల వ్యవసాయ భూమిలోకి వాడకొప్పుల పూర్ణయ్య 3 గేదెలు, వాడ కొప్పుల చిన్న రోశయ్య ఒక గేదె, వంక నరసింహారావు ఒక గేదె, బట్టు బాబురావు ఒక గేదె మేత మేసేందుకు వెళ్లాయి. గురువారం సాయంత్రం తీవ్రమైన గాలి దుమారానికి విద్యుత్ తీగ తెగి పడటంతో ఆ తీగకు తగిలి మృతి చెందినట్లుగా తెలిపారు. సుమారు నాలుగు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని గేదె యజమానులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీఓ దొడ్డి నరేష్



నవతెలంగాణ-పెన్‌పహాడ్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీఓ దొడ్డి నరేష్ అన్నారు. మండల కేంద్రంలో డ్రై డే సందర్భంగా వివిధ దుకాణాల ముందు భారీ ఎత్తున పేరుకుపోయిన చెత్త వివిధ రకాల ప్లాస్టిక్ వస్తువులు రోడ్డుకు ఇరువైపులా దుకాణాల ముందు చెత్త పేరుకుపోవడంతో గ్రామపంచాయతీ నుంచి దుకాణ దారులకు గ్రామ ప్రత్యేక అధికారి ఏఓ కృష్ణసందీప్‌తో కలిసి నోటీసులు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిబంధనలకు వ్యతిరేకంగా మరే ఇతర వస్తువులు వీధులలో వేసిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని అన్నారు. గ్రామంలో వీధులలో ఇరువైపుల ఉన్న పచ్చని చెట్లను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పెంచాలని ఆయన అన్నారు. మండల వైద్యాధికారి స్రవంతి ప్రజలకు పలు సూచనలు ఇస్తూ పాత టైర్లల్లో, పాత కుళాయిలలో, నీటి తొట్టిలో నీరు నిలువ ఉండడం వలన తోక పురుగులు ఏర్పడి ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శివకుమార్, ఏఎన్ఎంలు దుర్గమ్మ, వీరమ్మ, వెంకటమ్మ, అంగన్వాడీ టీచర్లు ఊర్మిళ, విజయ, పంచాయతీ సిబ్బంది శ్రవణ్, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

నవతెలంగాణ-కోదాడరూరల్

పిడుగుపాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని భవానినగర్‌లో నివాసం ఉంటున్న పొందురి రామారావు(55) వ్యవసాయ పొలం వద్ద గేదెలను మేపేందుకు వెళ్లగా పిడుగు పడి మృతి చెందాడు. దీంతో ఆ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నవతెలంగాణ
యాదాద్రి భువనగిరి
శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ కల్పించాలని వినతి

నవతెలంగాణ-మోటకొండూర్

తమ పిల్లలకు ప్రయివేట్ పాఠశాలలో 50శాతం రాయితీ కల్పించాలని కోరుతూ టీజేయూ జిల్లా అధ్యక్షులు మహ్మద్ షానూరుబాబా ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు.స్పందించిన కలెక్టర్ రాయితీ కల్పించేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపరాజు వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టికొప్పుల శ్రీనివాస్, జర్నలిస్టు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



నమాత్‌పల్లిలో దేవాలయానికి వెళ్లే దారిని పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

భువనగిరి పట్టణంలో నమాత్‌పల్లి గ్రామం లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్లేదారిని, మల్లేవాని చెరువుకట్ట వెడల్పు చేయుటకు శుక్రవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఎల్లాంల జంగయ్యయాదవ్‌తో కలిసి పరిశీలించారు.అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యేకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ శాఖ నుండి నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మట్ట శంకర్‌బాబు గౌడ్, ఎల్లాంల వెంక టేశం, కొండాపురం చంద్రమౌళి, కొండాపురం గణేష్ పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

నవతెలంగాణ-భువనగిరి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జండగే వైద్యాధికారులకు సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులతో ఆయన సమావేశమై సీజనల్ వ్యాధుల ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు.వర్షాకాలం మొదలైనందున అన్ని గ్రామాలలో నీటి నిలువలు ఏర్పడే అవకాశమున్నదని, తద్వారా దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉన్నందున దోమల నివారణా చర్యలు చేపట్టాలన్నారు.గ్రామాలలో ఇంటి చుట్టుపక్కల నీటిగుంతలు లేకుండా చూడాలని తెలిపారు. గ్రామాలలో ఆశా, ఏఎన్ఎంలు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండల అభివృద్ధి అధికారులు, వైద్యాధికార్లు సమన్వయముతో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలల్లో శానిటేషన్‌పై సిబ్బందికి అవగాహన కల్పించాలని, గ్రామాలలో నీటి నిలువలు ఉన్న గుంతలలో ఆయిల్ బాల్స్ వేసి దోమలు పుట్టకుండా చూడాలన్నారు. డయేరియా రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగేలా అవగాహన కలిగించాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాము కాటు, కుక్కకాటు తదితర జబ్బులకు కావాల్సిన మందులను నిలువ ఉంచుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. గత మూడేండ్లలో ఏమైనా గ్రామాలలో ప్రత్యేక ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే ఆ గ్రామాలపై నిఘాపెట్టాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి ఆశ్రమ పాఠశాల, పాఠశాలు సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలంలో గర్భిణి స్త్రీలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 01 నుంచి 19 వయస్సు వారికి ఆల్బెండజైజర్ మాత్రలు వేయాలని, అందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, జిల్లాలో 1,57,496 మందికి పిల్లలకు ఈ మాత్రలు వేయాలని, 01 నుంచి 02 సంవత్సరాల మధ్య చిన్నారులకు సగం మాత్ర పొడిచేసి పాలు లేదా నీటిలో కలిపి తాగించాలన్నారు. 03 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర మింగించాలన్నారు. పిల్లలలో రక్తహీనత పోషకాహార లోపము నివారించడానికి ఇది దోహదపడుతుందన్నారు. డీఎంహెచ్ఓ పాపారావు మాట్లాడుతూ నీటి సంబంధిత వ్యాధులు, కీటకజనిత సంబంధిత వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అనుబంధ శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేసి వారి మొబైల్‌నెంబర్‌ను ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామన్నారు.నులి పురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా పిల్లలందరికీ ఆల్బెండజైజర్ మాత్ర గురించి పాఠశాలల్లో జరిగే ప్రార్థన సమయంలో అవగాహన కల్పించాలని, అలాగే తల్లిదండ్రులతో సమావేశాల ద్వారా అవగాహన కల్పించి వందశాతం మాత్రలు పిల్లలకు వేసేలా సంబంధిత శాఖలన్నీ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ కే.గంగాధర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.ఎ.కృష్ణన్, జిల్లా పంచాయతీ అధికారి సునంద, ఉప జిల్లా వైద్యాధికార్లు డా.శిల్పిని, డా.యశోధ, ప్రోగ్రాం అధికారులు డా. రామకృష్ణ, డా.సుమన్‌కల్యాణ్, డా.వంశీ, వైద్యాధికారులు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.



'తల్లిదండ్రులు పిల్లల చదువు, ఎదుగుదల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి'

నవతెలంగాణ-భువనగిరిఅర్బన్

సాగుతున్న పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ పిల్లల చదువు,ఎదుగుదల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపాల్ టీవీ. సునంద సూచించారు.శుక్రవారం భువనగిరి జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో గల ఆ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సునంధ మాట్లాడుతూ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం ఇవ్వలేక పోతున్నా రన్నారు.దాని ప్రభావం పిల్లల చదువులపై పడుతుందన్నారు.పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఏరకమైన అలవాట్లు కలిగి ఉండాలనే అంశంపై వివరించారు.తమ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి నూతన ఒరవడికతో మెరుగైన విద్య అందించనున్నామని, అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాలఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను తరలించొద్దు

నవతెలంగాణ-భువనగిరి అర్బన్

భువనగిరి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను వేరే ప్రాంతానికి తరలించొద్దని బీజేపీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్ కోరారు. శుక్రవారం అర్బన్ పాఠశాలను తరలించే విషయంపై భువనగిరి ఎమ్మెల్యే స్పందించాలని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. క్యాంప్ ఆఫీస్‌లో ఎవరు లేకపోవడంతో గోడకు వినతిపత్రం అంటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్బన్‌లో ఉన్న స్కూల్‌లో కనీస వసతులు లేవని మారుమూల ప్రాంతానికి ఎలా తరలిస్తారని ప్రశ్నించారు.వైద్యం, రవాణా లేని ప్రాంతంలో పాఠశాల నిర్వహిస్తే కొన్ని రోజుల కిందే భువనగిరి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ వల్ల ఒక విద్యార్థిని కోల్పోయామన్నారు.విద్యార్థుల అవసరాలరీత్యా పాఠశాలలను నడపాలని కోరారు.అర్బన్ పాఠశాల భువనగిరి జిల్లాకేంద్రంలో ఉంటే అభివృద్ధికి నోచుకుంటుందని తెలిపారు.వారం రోజుల నుండి ఈ విషయంపై భువనగిరి ప్రజలంతా వ్యతిరేకిస్తున్నా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బూరుగు మణికంఠ, మంగు నర్సింహారావు, బట్టు క్రాంతి, కొలిచెల్మి మల్లికార్జున్,నాగు నరేష్,రత్నపురం శ్రీశైలం,కట్టమోజుఉషాకిరణ్, ఎదగానిసంతోష్, కల్లూరి జహంగీర్, కుమ్మరి మల్లేష్ పాల్గొన్నారు.





ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

నవతెలంగాణ-మోత్కూరు

మోత్కూర్ రెడ్‌క్రాస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచరక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మోత్కూర్ మున్సిపల్‌కేంద్రానికి చెందిన అత్యధికంగా రక్తదానం చేసిన ఐదుగురు దాతలు జె.సుబ్రహ్మణ్య శర్మ, అహ్మద్, మహమ్మద్‌అలీ, బాలెంల మధు,బండారు ప్రసాద్ శాలువాలు కప్పి మెమోటో అందజేసి ఘనంగా సన్మానించారు.అనంతరం స్థానిక లక్ష్మీనర్సింహ ప్రయివేట్ ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రక్తదాతలు ముందుకు వచ్చి ప్రాణదాతలుగా కావాలన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మోత్కూర్ శాఖ చైర్మెన్ ఓ.సత్యనాథ్,ఉపాధ్యక్షులు ముప్ప వెంకట్రెడ్డి,కార్యదర్శి మెట్టు మంగేష్,పీహెచ్‌సీ డాక్టర్ అమరావతి, రెడ్‌క్రాస్ మోత్కూర్ శాఖ సభ్యులు డాక్టర్ మధు,గుండు.ప్రసాద్,చాడ మంజుల,సి.అంజయ్య,డాక్టర్ చంద్రమౌళి, వి.జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- భువనగిరి ఎంపీ చామలకిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-బీబీనగర్

ప్రయివేట్‌పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల తీర్చిదిద్దాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో పనిచేస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండమడుగు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వపాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచడానికి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.ఇందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యా కమిటీలు సహకరించాలని కోరారు. ప్రభుత్వం పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తలిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించాలన్నారు.ప్రయివేట్‌టీచర్స్ మాదిరిగా ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ఉచిత విద్య, యూనిఫాములు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అర్హులైన ఉపాధ్యాయులు, అత్యుత్తమ స్కాలర్‌షిప్,రవాణా చార్జీలు, బాసర ఐఐటీలో ఉచిత ప్రవేశాలు, మొదలైన సౌకర్యాలు గురించి విద్యార్థులా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎరుకల సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ గోళి ప్రణీత పింగాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, పీఏసీఎస్ చైర్మెన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి, డీఆర్‌డీఓ కిషన్, స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





గోవధను అరికట్టాలని వినతి

నవతెలంగాణ-రాజపేట

మండలంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గోవధను అరికట్టాలని కోరుతూ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.బక్రీదు పండుగ సందర్భంగా మండలంలోని పరిసర గ్రామాల్లో గోవధ విచ్చలవిడిగా జరుగుతుందని ఆరోపించారు.గోవధను అరికట్టాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపించారు.వినతిపత్రం అందజేసిన వారిలో విశ్వహిందూ పరిషత్ రాజపేట అధ్యక్షులు భోగ జ్ఞానేందర్, వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బూర్గు సంతోష్‌రెడ్డి,భజరంగ్ దళ్ జిల్లా కో కన్వీనర్ మార్క శ్రవణ్‌కుమార్, మండల సహ సంయోజక్ కోయ అమర్, అయిరేని శ్రీధర్. పబ్బోజుశ్రీధర్,రేగొండ మాధవ్,వెంకటేష్,కృష్ణ, చింటూ, ప్రవీణ్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

రఘునాథపురంలో సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-రాజపేట

మండలంలోనిఎంపీపీఎస్ రఘునాథ పురం పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ఎంపీటీసీ బుడిగెరేణుక ఆధ్వర్యంలో పిల్లల చేత అక్షరాభ్యాసం చేయించారు.బడీడు పిల్లలు బడిలో ఉండాలని తెలిపారు.పిల్లల మనోవికాసాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని, డ్రాప్ అవుట్ లేకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ బూడిగ రేణుక,ఏఏపీ కమిటీ చైర్మెన్ కలకుంట్ల కవిత, ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఐలూ రాష్ట్ర క్లాసుల విజయవంతం కోరుతూ కరపత్రం విడుదల

నవతెలంగాణ-ఆలేరుటౌన్

జూన్ 15 , 16 తేదీలలో ఎల్బీనగర్ రంగారెడ్డి కోర్టు ఆవరణలో జరిగే ఐలూ రాష్ట్ర క్లాసులను జయప్రదం చేయాలని కోరుతూ ఆలేరు పట్టణంలో శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూకంటి రవీందర్ ఆధ్వర్యంలో సభ్యులతో కలిసి కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు క్లాసులకు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రావుల రవీందర్‌రెడ్డి,సీస శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చి రైతులకు న్యాయం చేయాలని ధర్నా



నవతెలంగాణ-చౌటుప్పల్

రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం చౌటుప్పల్ మండలపరిధిలోని చిన్నకొండూరు రెవెన్యూ గ్రామపరిధిలోని తూర్పుగూడెం, మందోళ్లగూడెం, సింగరాయచెరువు, లింగారెడ్డిగూడెం రైతులు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, చీరిక సంజీవరెడ్డి మాట్లాడారు.రైతులకు వారసత్వంగా వస్తున్న భూములను ప్రభుత్వం ట్రిబుల్ ఆర్ పరిధిలోకి తీసుకుంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ గ్రామాల రైతుల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి వస్తుందని తెలిపారు.ఈ భూములపై పునరాలోచన చేసి అలైన్‌మెంట్ మార్చి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండలకార్యదర్శి గంగదేవి సైదులు, రైతులు బోరెం ప్రకాశ్‌రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జంగారెడ్డి, పద్మారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఊదరి నర్సింహ, యాదయ్య, నరేశ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరులు ప్రజల గుండెల్లో సదా వెలుగొందుతూనే ఉంటారు

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

పీడిత ప్రజల విముక్తికి కోసం పోరాడిన అమరులైన వీరులు ప్రజల గుండెల్లో సదా వెలుగొందుతూనే ఉంటారని ఏనుగుల మోహనన్న నిత్యం చిరంజీవిగా ఉంటాడని, ప్రజా పోరాటాలలో రగిలే ఎర్రజండాలై రెపరెప లాడుతారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి, భువనగిరి డివిజన్ కార్యదర్శి ఆర్.జనార్దన్,బేజాడికుమార్ అన్నారు. శుక్రవారం, యాదగిరిగుట్ట కమతంగూడెంలో ఏనుగుల మోహనన్న 9వ వర్ధంతి సభ నిర్వహించారు. మోహనన్న స్మారక స్తూపం వద్ద జెండాను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, ఆర్. జనార్ధన్ ఎగురవేశారు.మోహనన్న చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు సంతాప సూచకంగా మౌనం పాటించి ఘనంగా విప్లవజోహార్లర్పించారు. సభకు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ యాదగిరిగుట్ట సబ్ డివిజన్ నాయకులు ఏనుగుల ఉదయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్, బేజాడి కుమార్ మాట్లాడుతూ మోహనన్న కష్టజీవిగా పుట్టి కాయ కష్టం చేసి, అసమానతలతో, వివక్షకు గురవుతూ, దోపిడీ, పీడనలకు నిత్యం గురిచేస్తూ ప్రజా జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్న అసమానంతో కూడుకున్న సమాజాన్ని సమానత్వ సమాజంగా మార్చడానికి మోహనన్న విప్లవ కమ్యూనిస్టుగా మారాడన్నారు. ప్రజలను మక్కువచేసుకొని ప్రజల్లో కలిసిపోయాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ ఏనుగుల మోహనన్న జీవిత సహచరి ఏనుగుల నర్సక్క కూతుళ్లు జీవనజ్యోతి, ఉమా, సిపిఐ జిల్లా నాయకులు కొల్లూరి రాజయ్య, కమటం గూడెం మాజీ సర్పంచ్ కమటం శ్రీరాములు, జిల్లా నాయకులు చీర బోయిన రాజయ్య, బర్మ బాబు, చిర బోయినకొమురయ్య, ఆర్ సీత, పద్మ సుదర్శన్, ఒగ్గు మల్లయ్య,కర్రె పాండరి, పాకాల నరేష్, తమ్మడి అంజయ్య, ఆర్.ఉదయ్, ఏనుగుల ఎల్లయ్య పుప్పాల సిద్ధులు, వఇంజ శ్రీనివాస్, తాడెం పాండు, పి రాఘవరెడ్డి, ఇక్కిరి కుమార్, తమ్మడి రమేష్, తమ్మడి మాధవి, తమ్మడి ఉమా, పాకాల సరిత, పద్మ శశిరేఖ, గడ్డం యాదగిరి, పగడాల శివ, కొమ్మిడి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



నమిలలో బడిబాట ర్యాలీ

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలంలోని నమిల గ్రామంలో శుక్రవారం అంగన్వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని తల్లుల, కిషోర్ బాలికల, పిల్లలతో ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పార్వతి,అంగన్వాడీ టీచర్లు పద్మ, శోభారాణి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఎంపీటీసీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని సూరారం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీటీసీ దోమల సతీష్‌ను శుక్రవారం ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరామర్శించారు.ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట జనంపల్లి ఎంపీటీసీ వేమవరం సుదీర్ బాబు, సూరారం మాజీ సర్పంచ్ దోమల ఐలేశ్వరి, నాయకులు పోతరాజు సాయికుమార్, కన్నెబోయిన బలరాం, ఆమేర్, గర్దాసు విక్రం, ఆవుల శ్రీధర్, తదితరులు ఉన్నారు.



అనాజిపురం ప్రాథమికపాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-భువనగిరిరూరల్

మండలంలోని అనాజిపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.నూతనంగా చేరిన చిన్నారులచే పలకలపై అక్షరాలు దిద్దించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షురాలు గునుగుంట్ల కల్పన శ్రీనివాస్ చిన్నారులకు పుస్తకాలు,నోట్‌బుక్స్,పలకలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాబురావు,ఉపాధ్యాయులు కృష్ణయ్య,కవిత,అంగన్వాడీ టీచర్ కే.సువర్ణ,గ్రామస్తులు బొల్లేపల్లి అనిల్,పద్మ, తదితరులు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు

- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

నవతెలంగాణ-భువనగిరి

విద్యుత్ స్తంభాలు శిథిలమై ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. భువనగిరి మండలపరిధిలోని నమాత్‌పల్లి, జిట్టవారిబావి, నాగిరెడ్డిపల్లి, గ్రామాల పరిధిలో గల గ్రామాలలో వేసిన విద్యుత్‌స్తంభాలు కొన్నేండ్ల నుండి శిథిల మయ్యాయి.సమస్యను సంబంధిత శాఖాధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో రైతులు పంటపొలాల వైపు వెళ్లాలంటే భయ పడుతున్నారు.విరిగిన స్తంభంపై 11కేవీలైన్ ఉండడంతో అది వెంటనే సరిచేయకపోతే ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు.అధికారులు వెంటనే స్పందించి శిథిలమైన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్

నవతెలంగాణ-రాజపేట

మండలంలోని రఘునాథపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణమహోత్సవంలో శుక్రవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భక్తి భావాలను పెంపొందించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుడిగేరేణుక పెంటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ గడిపల్లి శ్రవణ్‌కుమార్, అలయకమిటీ చైర్మెన్ చింతకింది రాందాస్, అలయకమిటీ వైస్‌చైర్మెన్ రాచకొండ స్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు బింగి రమేష్, రాజపేట మండల అధ్యక్షుడు నమిల మహేందర్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాంజీనాయక్, విఠల్‌నాయక్, బొంతసుధాకర్,ఇంజనరేశ్ , రాపోలు లక్ష్మారెడ్డి, బాలధ శ్రీకాంత్, కళ్ళెంపాండు చల్లురిచిన్నపోచయ్య, బల్లయాదేశ్, దొంకేనభాస్కర్ బల్లమురళి, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.



అందోల్ మైసమ్మ మినీగూడ్స్ నాయకునికి అశ్రునివాళి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ దండు మల్కాపురం గ్రామంలో శ్రీ అందోల్ మైసమ్మ మినీగూడ్స్ ఓనర్స్ అండ్ వర్కర్స్ ఆధ్వరంలో శుక్రవారం యూనియన్ ఉపాధ్యక్షులు చిలువేరు ఎల్లయ్య గుండె నొప్పితో మృతి చెందారు.మృతునికి ఇతనికి భార్యకుమారుడు, కుమార్తె ఉన్నారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య భౌతికకాయంపై పూలమాలలేసి నివాళులర్పించారు.ఎండి పాషా మాట్లాడుతూ ఎల్లయ్య మినీ గూడ్స్ సంఘం కోసం ఎనలేని కృషి చేశారని,వీరు చేస్తున్న పనిని నమ్ముకుని ఇటు సంఘాన్ని తన పనిని నమ్ముకుని సంఘం బలోపేతం కోసం అనేక మైన పోరాటాలు చేశారని కొనియాడారు.ఎల్లయ్య మరణం సంఘానికి తన స్నేహితులకు తీరని లోటన్నారు. ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల వలె ఎల్లయ్య కుటుంబానికి ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్ యూనియన్ అధ్యక్షులు జొన్నకండి దేవయ్య ప్రధాన కార్యదర్శి బోదుల లింగస్వామి నాయకులు దేవరాయ సుధాకర్,దేవరాయ కృష్ణ,ఒరుగంటి శ్రీను గౌడ్,కొన్‌రెడ్డి యాదగిరి, కప్పరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు



ఆలేరు పట్టణాభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణ అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 15 కోట్ల రూపాయల నిధులు విడుదల కోరుతూ, ఆలేరు పురపాలక సంఘంలో శుక్రవారం వార్డు కౌన్సిలర్లు, కౌన్సిల్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పట్టణం లోని మెయిన్ రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో గల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ చైర్మెన్ వస్పరి శంకరయ్య, వార్డు కౌన్సిలర్లు, కౌన్సిల్ సభ్యులు ఉన్నారు.



జాల పాలసొసైటీ చైర్మెన్‌గా గొల్లపల్లి రాంరెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలం జాల పాలసొసైటీ చైర్మెన్‌గా గొల్లపల్లి రాంరెడ్డి శుక్రవారం పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.తన ఎన్నికలకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారం అందించి పాటుపడతానని తెలిపారు.కొత్త డైరెక్టర్లుగా కొండం ప్రభాకర్‌రెడ్డి, కొల్లూరి కనకయ్యలను ఎన్నుకున్నారు. ఎన్నికైన చైర్మెన్,సభ్యులను తాజా మాజీ సర్పంచ్ గుంటి మధు సూదన్‌రెడ్డిని శాలువాతో బొకేలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, పాల సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బుడియ బాపుని దర్శించుకున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

మండలంలోని రంగుండ్ల గ్రామంలో బుడియ బాపు పెద్ద పూజ ఉత్సవాలు అంగోత్ భగవాన్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శుక్రవారం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి బుడియ బాపుని దర్శించికొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ప్రశాంత వాతావరణంలో పూజలు నిర్వహించు కోవాలన్నారు. ఆయన వెంట అంగోత్ బాలాజీ నాయక్, కర్నాటి లింగారెడ్డి, తుమ్మల పల్లి శేఖర్ రెడ్డి, గడ్డం సాగర్ రెడ్డి, అంగోత్ బాలు నాయక్, అంగోత్ పాండునాయక్, శంకర్ నాయక్, అంగోత్ లక్ష్మ నాయక్, తదితరులు ఉన్నారు.



రెండు మూడు రోజుల్లో పెండింగ్ సమస్యల పరిష్కారం

- డేటా సవరణకు సంబంధించినవి15 రోజుల్లో పరిష్కారం
- కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నిటిని రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని, డేటా కరెక్షన్‌కు సంబంధించిన దరఖాస్తులను 15 రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ దాసరి చందన, రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌కు తెలిపారు. శుక్రవారం ధరణి, రాష్ట్ర ప్రజావాణి దరఖాస్తుల పెండింగ్ పై రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ అన్ని జిల్లాల కలెక్టర్లు,రెవెన్యూ అధికారులతో హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లాకు సంబంధించి ధరణి పెండింగ్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ వివరణ ఇస్తూ కోర్ట్ కేసులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తామని, డేటా సవరణకు సంబంధించినవి15 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. కొన్ని దరఖాస్తుల పై క్షేత్రస్థాయిలో ఇదివరకే తనిఖీ చేసినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తామని, స్కానింగ్ సమస్యల వల్ల కొన్ని



అలస్యమవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ ధరణిలో ఉన్న దరఖాస్తులన్నింటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, పోర్టల్ లో ఉన్న దరఖాస్థులన్ని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఆర్డీఓ లు, తహసీల్దార్లతో ప్రతి రోజు సమీక్షించాలని, పెండింగ్ ఎక్కువగా ఉన్న మండలాలపై ఎక్కువ దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవోలు, తహసిల్దారులు, పాల్గొన్నారు.

యూనిఫామ్స్‌తో పాటు, పుస్తకాలు పంపిణీ

జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన

గతానికి భిన్నంగా పాఠశాలలు పున: ప్రారంభం కాగానే యూనిఫామ్స్ తో పాటు, పుస్తకాలు ఇస్తున్నామని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ పాఠశాలలను మహార్దశకు తీసుకువచ్చే అవకాశం వచ్చిందని, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా పనులు చేపట్టినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో జిల్లాలో అన్ని పనులను పూర్తి చేస్తామన్నారు. పాఠశాల పనులలో అందర్నీ భాగస్వామ్యం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. , రెండవ జత యూనిఫామ్ 10 రోజుల్లో ఇస్తామని తెలిపారు.జిల్లా ఎస్పీ చందనా దీప్తి ,డీఈవో బిక్షపతి తదితరులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, బ్రాహ్మణ వెల్లంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కూ కుట్ల నరసింహ గ్రామ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఉషయ్య అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు హాజరయ్యారు

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కొత్తపంట రుణాలివ్వాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు కొత్త పంటల రుణాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు డిమాండ్ చేశారు.తెలంగాణ రైతు సంఘం అధ్వర్యంలో ఆలేరు మండలకేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు పంట రుణాలు అందించాలని కోరుతూ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ వై.చంద్రశేఖర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరిబాలరాజు హాజరై మాట్లాడుతూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కొత్త పంట రుణాలు పెంచి ఇవ్వలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రైతు భరోసా హామీ ఒక్క ఎకరానికి 7500 రూపాయల నగదును అందిస్తామని చెప్పిందని గుర్తు చేశారు. రైతులువిత్తనాలు నాటేందుకు భూమిని చదును చేసి



రామన్నపేటలో..

సిద్ధంగా ఉన్ననేటి వరకు రైతులకు రైతు భరోసా అందించలేదని విమర్శించారు. రైతు సోదరులు ఖరీఫ్ సీజన్లో సాగు చేసే మొక్కజొన్న, పత్తి ,వరి ,కంది, మినుములు తదితర పంటలు పండించేందుకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం రైతుకు రైతు భరోసా పథకం పెట్టుబడి సాయంగా అందించలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి 20 లక్షలకు పైగా పంట సాగు చేయాలని ప్రణాళికలు ఉన్నప్పటికీ, వ్యవసాయ శాఖ రైతులకు మాత్రం నాణ్యమైన విత్తనాలు అందించడంలో పూర్తిగావిఫలమయ్యారని తెలియ జేశారు. నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం మోపుతున్నామని చెబుతున్నప్పటికీ, గతంలో లాగే ఇప్పటికి నకిలీ విత్తనాల ముఠాలు రైతులను మోసం చేస్తూనే ఉన్నాయని, తూతూ మంత్రంగా వారిపై చర్యలు తీసుకో వడం వల్లే రైతులు నష్టపోతున్నారని అన్నారు.జూన్ రెండో వారం పూర్తవుతున్న విత్తనాలు అందించడంలో వ్యవసాయ శాఖ పూర్తిస్థాయిలో రైతులకు విత్తనాలను అందించడంలో విఫలమైందన్నారు. రైతులు విత్తన సేకరణకు ఇబ్బందులు పడుతున్నాడని, దేవుడు కరుణించిన పాలకులు కనికరించడం లేదని ,దీనివల్ల రైతులు పెట్టుబడి సాయం కోసం అధిక వడ్డీలపై ఆధారపడి అప్పుల పాలవుతున్నారని చెప్పారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని కోరారు.రైతులకు రుణమాఫీ అమలు కాకపోవడంతో బ్యాంకర్లు రైతులను అప్పు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారని, కొత్త లోన్లు ఇవ్వడానికి ససేమీరా అంటున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో అవాజ్ జిల్లా అధ్యక్షులు, ఎంఏ. ఇక్బాల్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దూపటి వెంకటేష్,రైతు సంఘం పట్టణ, మండల నాయకులు గణగాని మల్లేష్, వడ్డే మాన్ బాలరాజు. , మొరిగాడి అశోక్, గ్యార భాస్కర్, మేకల బాలరాజు, గ్యార అశోక్, మొరిగాడిఅంజయ్య ఎస్ఎఫ్ ఐ నాయకులు కాసుల నరేష్, చెక్కిళ్ళ అంజమ్మ, గౌరమ్మ, ముప్పిడి బాలమ్మ, ఊర్మిళ తదితరులుపాల్గొన్నారు.

రామన్నపేట: స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు నూతన రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం కెనరా, ఏపీజీవీబీ బ్యాంకుల ఎదుట రైతులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ఆయా బ్యాంకు మేనేజర్లకు వినతి పత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమై రైతులకు దున్నకానికి, విత్తనాలకు, ఎరువులకు, వ్యవసాయ కూలీలకు డబ్బులు లేక బ్యాంకు రుణాలందక ప్రయివేటు ఫైనాన్స్ వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని అమలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలన్నారు. పట్టా పాసు పుస్తకాలు లేకుండా బ్యాంకులు ఋణాలు ఇవ్వాలని, సన్నవడ్లకే బోనస్ అని ప్రకటించడం సరికాదని, అన్ని రకాల పంటలకు ఇవ్వాలని, రైతుబీమా సాయం విధివిధానాలు వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల అధ్యక్షుడు గన్నెబోయిన విజయభాస్కర్, నాయకులు కందుల హనుమంతు, గాదె నరేందర్, బావండ్లపల్లి బాలరాజు, నీల అయిలయ్య, అంబటి సురేందర్‌రెడ్డి, పిట్టల శ్రీను, మేట్టు శ్రవణ్, కంకల శేఖర్, గంగదేవి అంజయ్య, గుంజే సైదులు, వళ్ళమల్ల నర్సింహ, జనపాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆలేరులో..

యథేచ్ఛగా ఇసుక దందా

నవతెలంగాణ-మోతె



పాలేరు వాగు సమీపంలోని పొలాల వెంట సహజంగా లభిస్తున్న ఇసుక వనరులు దందా దారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం తమకు సంబంధం లేదు అన్నట్టుగా పట్టించుకోవడం లేదు. ఒకప్పుడు ట్రాక్టర్ లేని ఇసుక దందా దారులు అప్పటికప్పుడు కొనుగోలు చేస్తున్నారు. ఈ తతంగం అంతా మండల పరిధిలోని నరసింహాపురం తుమ్మగూడెం రాయి కుంట తండా ఉర్లుగొండ రంగాపురం తండా గ్రామాలకు చెందిన దందాదారులు దందా కొనసాగిస్తున్నట్లు ఆయా గ్రామాల నుండి అందుతున్న సమాచారం. వాగు నుండి ఇసుకను తరలించి గృహాలలో పొలాలలో చేలకలల్లో రాసులుగా పోసుకొని వ్యాపారము కొనసాగిస్తున్నట్లు ప్రజలు చెప్తున్నారు. ఈ వ్యాపారం సూర్యాపేట జిల్లా గ్రామాలలో కాకుండా పక్కనే ఉన్న మహబూబాద్ ఖమ్మం జిల్లా గ్రామాలకు మండలాలకు తరలించి విక్రయిస్తున్నట్లు తెలుపుతున్నారు. ఇప్పటికే ఒక అధికారికి నెలవారీగా ట్రాక్టర్ ఒక్కంటికి పదివేల రూపాయలు ముడుపులు ముడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు తమ పొలాలను బ్రిడ్జిని కాపాడాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-అర్వపల్లి

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుపై గత కొన్ని రోజులుగా ఇసుక రవాణాపై పలువురు సోషల్ మీడియాలో అసత్య ఆరోపణ చేస్తున్నారని వాటిని వెంటనే మానుకోవాలని తుంగతుర్తి నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు నర్సింగ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపాక సత్యం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాలిగౌరారం మండలం కేంద్రంలోని వంగమర్తి గ్రామంలో జరిగే ఇసుక రవాణా యాదాద్రి పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నారని స్వయంగా కలెక్టర్ ఫోన్ చేసి ఎమ్మెల్యే మీడియా ముందు ప్రత్యక్షంగాలో తెలియజేయడం జరిగింది ఎమ్మెల్యేపై ప్రజా ఆదరణ పెరగడంతో కావాలని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేల్పుల రమేష్ యాదవ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శీగ నసిర్ గౌడ్ మండల కోశాధికారి కదం శ్రీనివాస్ గ్రామ శాఖ అధ్యక్షులు కుంటిగొర్ల శ్రీనివాస్ మేకల రాంబాబు బొల్లం లింగరాజు వదిన మాంద్ర లింగయ్య నల్లకుంట్ల శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షులు మచ్చ నాగార్జున మహంకాళి శ్రీనివాస్ దేగల నరేష్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గేదె మృతి

నవతెలంగాణ-మద్దిరాల

ప్రమాద వశాత్తూ విద్యుద్ఘాతానికి గురైన ఓ గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత రైతు ముసిగుంపుల సోమయ్య తెలిపిన వివరాల ప్రకారం తన వ్యవసాయ భూమివద్ద గేదేని మెపుతుండాగా ప్రమాద వశాత్తూ విద్యుత్ తీగలు తగిలి అక్కడిక్కడే గేద మృతి చెందని రైతు తన ఆవేదన వ్యక్తంచేశారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించండి

- సీసీఎల్ఏ ప్రిన్సిపల్ సెక్రెటరి నవీన్ మిట్టల్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



జిల్లాలలో పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. శుక్రవారం పెండింగ్ ధరణి దరఖాస్తులపై జిల్లా కలెక్టర్, ఆదనపు కలెక్టర్‌లతో హైద్రాబాద్ నుండి ముందుగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, అలాగే సూర్యాపేట కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కన్ఫెరెన్సులో ఉన్నతాధికారులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల వారీగా పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిశీలన తదుపరి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి కలెక్టర్, ఆర్‌డిఓలు అలాగే తహశీల్దార్ల పరిధిలో గల దరఖాస్తులు పరిశీలన తదుపరి వేగవంతం చేయాలని సూచించారు. తదుపరి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల భూసమస్యల పెండింగ్ ధరణి దరఖాస్తులు 7,093 ఉన్నాయని అట్టి వాటిని పది రోజుల్లో పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్. లత ఆర్డీఓ వేణు మాధవ్, తహశీల్దార్లు శ్యామ్ సుందర్ రెడ్డి, కృష్ణయ్య సంఘ మిత్ర, పర్యవేక్షకులు సుదర్శన్ రెడ్డి, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాస్

- అవయవాలు దానం

నవతెలంగాణ-నల్లగొండడెస్క్



ఈ నెల9న రోడ్డు ప్రమాదంలోవ గాయపడిన ముప్పిపల్లి శ్రీనివాస్ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందగా అతని అవయవాలను దానం చేశారు. వివరాల్లోకి వెళితే.. గుర్రంపోడు మండల చేపూరు గ్రామానికి ఎల్లరాములు లక్ష్మమ్మ దంపతుల చిన్న కుమారుడు ముప్పిపల్లి శ్రీనివాస్ బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి 20ఏండ్లుగా మెండు ఎంటర్ ప్రైజ్ కేబుల్ నెట్ వర్క్ లో చేస్తున్నాడు. ఈనెల 9తేదీన తన పనిలో భాగంగా పని ముగించుకుని ఇంటికి చేరే మార్గం లో హైదరాబాద్ లోనిచాదర్‌గట్ సాయి బాబా గుడి ముందు బారికేడ్‌కు తన బైకు యాండిల్ తాకడంతో కిందపడ్డాడు. వెంటనే సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌కు తరలించారు. తలకు గాయాలు కావడంతో ఆపరేషన్ చేశారు. శుక్రవారం హాస్పిటల్స్ డాక్టర్లు శ్రీనివాస్ బ్రైన్ డేత్ అయ్యాడని నిర్ధారించారు. తన భార్య రేణుకా , తల్లి కుటుంబ సభ్యులు ఎప్పుడూ ఎవరు ఏ సాయం అడిగిన. కాదనకుండా ఏ సాయం అయిన చేసే తన భర్త శ్రీనివాస్ తాను చనిపోయి కూడా మరో నలుగురికి ప్రాణాలు కాపాడి తన ఔన్నత్యాన్ని చాటారు. అవయవాలు కీడ్నీ,కళ్ళు, లివర్ , ఊపిరితిత్తులను దానం చేసిన శ్రీనివాస్‌కు ఆస్పత్రి వారు గౌరవం వందనం చేశారు. పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబంలో సంవత్సరం శ్రీనివాస్ సొంత అన్న ముప్పి పల్లి రవి గతేడాది మృతిచెందాడు. .ఈనెల 16న శ్రీనివాస్ పుట్టిన రోజు వుండడం తో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. శ్రీనివాస్‌కు ఒక కోడుకు,ఒక కూతురు వున్నారు . పెద్ద మనస్సుతో ఆలోచించి ఆ కుటుంబానికి తమ వంతు సాయ సహకారాలు చేసి శ్రీనివాస్ పిల్లల చదువుకు సాయం చేయాలని కోరుతునానరు. వారి కుటుంబానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం పోరాటం

నవతెలంగాణ-దేవరకొండ



ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంప్లాయిస్ యూనియన్ దేవరకొండ గౌరవాధ్యక్షులు పల్లా నరసింహారెడ్డి అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్రంలో 11 ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఏర్పాటు నుంచి ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఎన్నో చట్టాలను సాధించిందని తెలిపారు. నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్టీసీని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిపల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు ఎండి మైనుద్దీన్, డిపో కార్యదర్శి డివి నారాయణ, యాదయ్య ,పాండురంగ చారి, విజయ రెడ్డి, జానీ భారీ ,మన్సూర్, నయీమ్, పల్లా రంగా రెడ్డి,నూనె వెంకటేశ్వర్లు, జే వెంకట్రములు, కృష్ణా రెడ్డి,రాజమల్లయ్యమల్లేశం, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల మధ్యలో నుండి డ్రెయినేజీ నిర్మాణం వద్దంటూ నిరసన

నవతెలంగాణ-ఆలేరుటౌన్



పట్టణంలోని కేసీఆర్ కాలనీ, ఇండ్ల మధ్యలో నుండి డ్రెయినేజీ నిర్మాణం వద్దంటూ కాలనీవాసులు నిరసన తెలియజేశారు.కొద్ది నెలలుగా పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో డ్రెయినేజీ సమస్య ఇబ్బందికరంగా మారడంతో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు ఆలేరు చైర్మెన్ ఆస్పరి శంకరయ్య ,మున్సిపల్ కమిషనర్ లక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతోఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దృష్టికి రెండు రోజుల క్రితం తీసుకువెళ్లడంతో వెంటనే సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆదేశాలు జారీ చేశారు. కాలనీలో సమస్యను సమీక్షించారు. సమస్యను పరిష్కరించేందుకు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీ డ్రెయినేజీ మురుగునీరు తొలగించేందుకు శుక్రవారం పనులు ప్రారంభించడంతో కాలనీ మధ్యలో నుండి వద్దంటూ కొందరు కాలనీవాసులు నిరసన తెలిపారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. అధికారులు స్పందించి, రెండు రోజుల వ్యవధితో తాత్కాలిక పరిష్కారం చేపట్టారు. ఈ సమస్యను పర్మినెంట్గా తీర్చాలని కోరుతూ ఎమ్మెల్యే కి డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గట్టు రాజు, గౌరవ అధ్యక్షులు గోరంట్ల రాజు, కోత్వాల రాములు, సంతోష్,సోను, లక్ష్మణ్,బాలకృష్ణ, శ్రీను, అఫ్జల్, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

బోగారంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలం బోగారం గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ, శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణమహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అంతటి పద్మ రమేష్,, మాజీ వైస్ఎంపీపీ బద్దుల ఉమారమేష్, జనంపల్లి ఎంపీటీసీ వేమవరం సుధీర్ బాబు, నాయకులు సాల్వేర్ అశోక్, కంభంపాటి శ్రీనివాస్, కన్నెబోయిన బలరాం, అంతటి మల్లేష్, బొడ్డుపల్లి రాజు, గర్దాస్ విక్రమ్, ఆవుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువ డ్రయినేజీ నిర్మాణం చేపట్టాలని ఫిర్యాదు

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో మురగు కాలువ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజావాణిలో శుక్రవారం నేలపట్ల సీపీఐ(ఎం) ఎంపీటీసీ తడక పారిజాత వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ నేలపట్ల గ్రామంలో 500 గడపలు 2500 జనాభా ఉందన్నారు.మా గ్రామంలో ఎప్పటికీ మురుగు కాలువ డ్రయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

దుస్తులు,పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-మఠంపల్లి

మండలంలోని పెదవీడులో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు దుస్తులు పుస్తకాలు పంపిణీ చేశారు. కేంద్రంలో తహసీల్దార్ మంగ మాట్లా డుతూ బడిబయట ఉన్న పిల్లలందర్ని బడిలో చేర్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శత్రనాయక్, ఎంపీడీవో మామిడి జానకి రాములు, పివి దుర్గాప్రసాద్, శేషరెడ్డి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి

నవతెలంగాణ-పెద్దవూర

విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన పెద్దవూర మండలం సంగారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం... సంగారం గ్రామానికి చెందిన కంచెర్ల రామచంద్రారెడ్డి ఉదయం తన వ్యవసాయ పొలాల మధ్య తన వ్యవసాయ క్షేత్రంలో పొలల గట్టున మేస్తుంది. పొలంలో ఉన్న విద్యుత్ స్తంభాలు గాలికి కిందపడి పోయాయి. తీగలు ఎద్దు మీద పడడంతో మృతిచెందింది. తనకు వ్యవసాయ పనులకు ఉపయోగ పడుతుందని, వ్యవసాయం ఎలా చేసుకోలో అని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. సుమారు ఎద్దు విలువ రూ.50 వేల ఉంటుంది. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రాష్ట్రస్థాయి రెడ్‌క్రాస్ అవార్డులు అందుకున్న మోత్కూరు ప్రతినిధులు

నవతెలంగాణ-మోత్కూర్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల శాఖలో ఎంతోకాలంగా రక్త దానాలను ప్రోత్సహిస్తున్న జిల్లా డైరెక్టర్ ఎస్.ఎస్.చారి,స్థానిక ప్రజాభారతి విశ్రాంత ప్రధాన కార్యదర్శి టి.ఉప్పలయ్యలు శుక్రవారం హైదరాబాద్ రాజభవన్‌లో రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌మిశ్రా(ఐఏఎస్), రెడ్ క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం(ఐఏఎస్) ల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.రాష్ట్రస్థాయిలో మోత్కూరు రెడ్‌క్రాస్ శాఖ పక్షాన సేవలందించినందుకు రాష్ట్ర రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ వారి సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టియాన్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మదన్మోహన్, ఏవో కోటిరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మెన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, జిల్లా కోశాధికారి దేవనక అంజయ్య, జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు బీసు మత్స్యగిరి పాల్గొన్నారు.



అమ్మ ఆదర్శపాఠశాలల పనులు, మిషన్‌భగీరథ సర్వేపనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, మిషన్ భగీరథ ఇంటింటి సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టరు హనుమంత్ కే.జెండగే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేటులోని సమావేశ మందిరంలో మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులతో ఆయన సమీక్షించారు.అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించి కనీస వసతులైన తాగునీరు, మైనర్ రిపేర్లు, కిటికీలు, తలుపుల రిపేర్లు, విద్యుత్ పనులు, ఫాన్స్, లైట్స్ పనులు, ఉపాధి హామీ పనుల కింద టాయ్లెట్స్, బాలికల కోసం ప్రత్యేక టాయ్లెట్స్ పనులు సత్వరమే పూర్తి చేసుకోవాలన్నారు.ప్రతి పాఠశాలకు పనుల వారిగా ఫైల్స్ ఏర్పాటు చేసుకోవాలని, పనులు పూర్తయిన చోట ఎంపీడీఓలు పరిశీలించి సంబంధిత బడ్జెట్ రిలీజ్ చేయాలని, పనులు పూర్తయిన పాఠశాలల్లో పెయింటింగ్ పనుల కోసం వివరాలు పంపాలని తెలిపారు. మిషన్ భగీరథ ఇంటింటి సర్వే పకడ్బందీతో వేగంగా జరగాలని, మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయితీ అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు పూర్తి సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వేను పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామ పంచాయితీలు, హ్యాబిటేషన్లలో ఇంటింటి సర్వే వివరాలను పంచాయతీ, సెక్రెటరీల ద్వారా యాప్‌లో అప్లోడ్ వేగంగా నిర్వహించాలని, సర్వే ప్రాముఖ్యతను అందరూ గమనించా లన్నారు.ప్రతి ఒక్క ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యంగా సర్వే నిర్వహించాలని, ప్రతి ఇంటి నల్లా కనెక్షన్ వివరాలను నమోదు చేయాలని, లింక్ హౌజెస్ మిస్ అయితే వారిని కొత్తగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె గంగాధర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఎ. కృష్ణన్, జిల్లా పంచాయితీ అధికారి సునంధ, డీఎంహెచ్ఓ పాపారావు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-చిట్యాల టౌన్



మేరకు మిషన్ భగీరథ పథకం పై ప్రక్షాళన చేసి ఉరుమడ్ల గ్రామంలో జరిగిన అవినీతిని వెలికి తీసి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండలంలోని ఉరుమడ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు కొనేటి యాదగిరి, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు సైదులు, పల్లపు బుద్ధుడు, పట్ల జనార్దన్, కురుపటి లింగయ్య బొడ్డు శ్రీను, జనపాల శ్రీను, పాకాల దినేష్, మేడబోయిన శ్రీనివాస్, గంగాపురం వెంకన్న, గుత్తా రవీందర్ రెడ్డి, రూపని యాదయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com

కోర్టు భవన నిర్మాణానికి స్థల పరిశీలన



నవతెలంగాణ-తుంగతుర్తి

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తుంగతుర్తిలోని జూనియర్ సివిల్ కోర్టు భవన సముదాయాన్ని అతి త్వరలో అన్ని వసతులతో నిర్మించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జ్ ఫర్విన్ కౌసర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత శాఖ వారు హైదరాబాద్ నుండి తుంగతుర్తికి వచ్చి స్థలాన్ని పరిశీలించి సర్వే చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లపల్లి సత్యనారాయణ,న్యాయవాదులు జిల్లా కుమారస్వామి, జిలకర చంద్రమౌళి, హరిచరణ్, ప్రతాప్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

'రక్తదానం చేసి.. ప్రాణదాతలు అవ్వండి'



నవతెలంగాణ-హుజూర్‌నగర్

ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేసి ప్రాణదాతలు కాండి అని ఇండియన్ రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్ షేక్ మన్సూర్ అలీ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటికే 48 సార్లు రక్తదానం చేశానని తెలిపారు. నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ పట్టణాలలోనే వివిధ ఆస్పత్రులలో పనిచేశానని రక్తదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడానికి రెడ్ క్రాస్‌తో కలిసి పని చేశానన్నారు. ప్రస్తుతం ఆర్ఎంపి వైద్యునిగా పనిచేస్తూ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు.

నైపుణ్యాలని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలి

- పది రోజుల్లో ఐటి టవర్ లో శిక్షణాకార్యక్రమాలు ప్రారంభించాలి
- అవసరమైతే రుణ సహాయం అందిస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్గొండ జిల్లాలో అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అయన జిల్లా కలెక్టర్ ఛాంబర్లో వి హబ్ ద్వారా నల్గొండ జిల్లాలో నైపుణ్యాల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చర్చించారు. జిల్లాలో నిమ్మ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి, అదేవిధంగా మట్టి కుండలు, బాటిళ్ల తయారీకి అవకాశాలు ఉన్నాయని, అదే విధంగా ఇతర రంగాలలో నైపుణ్యాల



అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. వి హబ్ ప్రోగ్రామ్ మేనేజర్ ఊహ, వి హబ్ డైరెక్టర్ నల్గొండ జిల్లాలో స్వయంసహాయక మహిళా బృందాలు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు, మధ్యలో బడి మానేసిన వారు, అదే విధంగా ఉద్యోగాలకు సిద్ధంగా ఉన్నవారు విద్యార్థులకు వివిధ రకాల శిక్షణను ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వం ఇదివరకు రూపొందించిన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోగ్రాం కింద కార్యక్రమాలను చేపట్టి నైపుణ్యాలను పెంపొంది ంచేందుకు ఆస్కారం ఉందని తెలుపగా, మంత్రి మాట్లాడుతూ వారం, పది రోజుల్లో ఐటీ టవర్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించాలని, అవసరమైతే రుణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మునుగోడులో తాటి బెల్లం తయారీ, ఇతర ఉత్పత్తుల తయారీకి ప్రణాళిక రూపొందించాలని, నల్గొండ జిల్లా కేంద్రంలో నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన ఒక కేంద్రాన్ని ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, అదనపు కలెక్టర్లు టీ. పూర్ణచంద్ర, జె. శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, డిఆర్డిఓ నాగిరెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులో భాగంగానే కూల్చివేతలు

- మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమళ్ల అన్నపూర్ణ

నవతెలంగాణ-సూర్యాపేట

రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే పట్టణంలో కూల్చివేతలు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ విమర్శించారు. శుక్రవారం స్థానిక జాజు రెస్టారెంట్‌ను అధికారులు కూల్చివేసిన సందర్భంగా ఆమె కౌన్సిలర్లతో కలిసి రెస్టారెంట్‌ని సందర్శించి మీడియాతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న సూర్యాపేటలో దుర్మార్గపు పాలన కొనసాగుతుందని ఆరోపించారు. పట్టణంలోని వ్యాపారస్తులు, సామాన్య ప్రజానీకం తీవ్రభయాందోళనలకు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అధికారులు పాలక మండలికి కనీస సమాచారం లేకుండా ఎటువంటి నోటీసులుఇవ్వకుండా కట్టడాలను కూల్చివేయడాన్ని తీవ్రంగా తప్పు పడుతున్నామని అన్నారు. కట్టడాలను కూల్చివేసి కొంతమంది అధికార పార్టీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. సూర్యాపేట ప్రజలు విజ్ఞులు అన్ని గమనిస్తున్నారని ఆమె అన్నారు. అధికారులు చట్ట



ప్రకారంగా పనిచేయాలని, అంతే కాని అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి వారు చెప్పిందల్లా చేస్తే తర్వాత పరిణామాలు అధికారులే అనుభవించాల్సి ఉంటుందని అన్నపూర్ణ హెచ్చరించారు. ఆమె వెంట జెడ్పీటీసీ జీడీ బిక్షం, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, కౌన్సిలర్లు ఆకుల లవకుశ, తాహెర్ పాషా, బీఆరెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్, నాయకులు కొండపల్లి సాగర్ రెడ్డి, వల్దాస్ జానీ, బత్తుల జానీ, భవ్ సింగ్,మోత్కురి సందీప్ ఎల్లురి రామ్మూర్తి, శేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డులోని ఈదుల పర్రె తండా పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి ఐ శాంతయ్య, మండల నోడల్ అధికారి తిరుమలగిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డి శ్రీనివాస్ సందర్శించారు. గ్రామంలోని పిల్లల తల్లిదండ్రులను కలిసి వారిని మోటివేట్ చేసి పిల్లలను బడికి పంపే విధంగా చూడాలని, పాఠశాలకు ఒక ఉపాధ్యాయుని ఏర్పాటుచేసి పాఠశాలను పున ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉచిత పాఠ్య పుస్తకములు యూనిఫామ్స్ మధ్యాహ్న భోజన పథకంలో భోజనం



అందించబడునన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిసి హెచ్ నరేష్, ఉపాధ్యాయుడు పాముకుంట వెంకన్న, అంగన్వాడీ టీచర్ ఏ. అనిత గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరిస్తా



- ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-ఆలేరుటౌను

రానున్న రోజుల్లో ఆలేరు పురపాలక సంఘంలోని సమస్యల పరిష్కారం కొరకు వీధి వీధినా, ప్రతి వార్డు కలియదిరిగి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తానని, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పారిశుద్ధ్య పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, ప్రజలకు మెరుగైన జీవన విధానాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు పట్టణంలో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రతి మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో అందరూ అధికారులు పాల్గొనాలని తెలిపారు.పారిశుధ్యపనుల్లో భాగంగాచెత్తను ఆలేరు పెద్ద వాగులో వేయకుండా,డంపింగ్ యార్డ్‌ను వాడాలన్నారు. అలేరు మున్సి పాలిటీలో టాక్స్ చెల్లిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో నూతన నిర్మాణాలను ఎక్కడెక్కడ జరుగుతున్నాయో పూర్తి సమాచారం మున్సిలల్ అధికారుల వద్ద ఉండాలన్నారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే నోటీసులు అందజేసి చర్యలు చేపట్టాలన్నారు.ప్రభుత్వభూములను కబ్జా చేసి నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు.అలేరు పట్టణంలో ఈ నెల 18-20వతేదీల్లో అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్‌చైర్మెన్ వస్పరి శంకరయ్య,కమిషనర్ లక్ష్మి, కౌన్సిలర్లు సీహెచ్.సునీత, బేతిరాములు, గుత్తా సమంతారెడ్డి,సంగు భూపతి, మోర్తాల సునీతరమణారెడ్డి, జూకంటి శ్రీకాంత్, కౌన్సిల్ సభ్యులు బ్యులారాణి, ఎండి రియాజ్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులకు సహకరించండి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

నవతెలంగాణ-చండూర్

మున్సిపల్ లో అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులను ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి, అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు విస్తరణ పనుల్లో ఎవరైనా నష్టం కలిపితే వారికి తన వంతుగా నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎవరు కూడా అభివృద్ధి పనులకు అడ్డు రావద్దన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి జరగాలని, వేగవంతంగా పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఎక్కడ కూడా రోడ్ల పైన నీళ్లు నిల్వకుండా చూడలని కమిషనర్ మణికరణ్‌ను ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై ఏఈతో



కలిసి మాట్లాడారు, కమిషనర్ పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ఇష్టం లేకపోతే సెలవుపై వెళ్లు అని మండిపడ్డారు. త్వరలో మున్సిపల్ రోడ్డు విస్తరణ పనులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దోటి వెంకటేష్ యాదవ్, ఎంపిటిసి పల్లె వెంకన్న,పట్టణ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్, డాక్టర్ కోడి శ్రీనివాసులు, ఎండి సుజావుద్దీన్, సాపిడి రాములు, కోడి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-నూతనకల్

నేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే బడిబాట కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామెల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు హాజరవుచున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దొంగల నాగేశ్వరరావు ఆచూకీ తెలపండి: ఎస్సై

నవతెలంగాణ-చింతలపాలెం

దొంగల నాగేశ్వరరావు ఆచూకీ తెలపగలరని ఎస్సై సైదిరెడ్డి విలేకరులతో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేదీ 04 జూన్ 2024న ఉదయం 9:40 గంటల నుండి దొండపాడు గ్రామానికి చెందిన దొంగల నాగేశ్వరరావు తండ్రి కనకయ్య అను వ్యక్తి ఇంటి నుండి ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లి పోయినాడని, చుట్టుపక్కల బంధువుల ఇండ్లల్లో వెతకగా అతని ఆచూకీ లభించకపోవడంతో అతని కుమారుడు దొంగల కార్తీక్ తండ్రి నాగేశ్వరరావు అను వ్యక్తి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని వినతి

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ చేనేత సహకారసంఘం పర్సన్స్ ఇన్‌చార్జి, బీఆర్ఎస్‌కు చెందిన కందగట్ల భిక్షపతి, పాలకవర్గం అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ శుక్రవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి



రాజగోపాల్‌రెడ్డికి చేనేత కార్మికసంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ పాలకవర్గం 12 ఏండ్ల నుండి కొనసాగుతుందని తెలిపారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సంఘం ఆస్తులను విక్రయి ంచేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో గోశిక స్వామి, గుర్రం నర్సింహ, వనం ధనుంజయ, గోశిక రవి, నర్సింహా, జనార్ధన్, యాదగిరి, భిక్షపతి ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-తిరుమలగిరి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ స్కూల్‌లో చదువుకొనే విద్యార్థుల కోసం ఇంగ్లీష్ విద్యను బలోపేతం చేయడం కోసం ఇంగ్లీష్ వ్యాకరనం, భాషా స్పీచ్, వకాబ్లరీ పెంచడం కోసం ఇంగ్లీష్ పుస్తకాలను ఉపాధ్యాయులకు బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షులు పులిగిల్ల వీరమల్లు యాదవ్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రో వెంకట రాజయ్య మాట్లాడుతు ఈ ప్రపంచంలో ఇంగ్లీష్ విద్యా చాలా అవసరమని పోటీ ప్రపంచంలో నిలదొక్కు కోవాలంటే ఇంగ్లీష్ విద్యా అవసరమని అన్నారు. ప్రభుత్వ స్కూల్‌లో చదువుకొని విదేశాలలో స్థిరపడిన ఎన్‌అర్‌ఐలు ప్రభుత్వ స్కూల్‌లను దత్తత తీసుకోవాలని కోరారు. అనంతరం తిరుమలగిరి ప్రభుత్వ స్కూల్ యాజమాన్యం ప్రో,వేంకట రాజయ్య ను సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలగిరి ఎం ఈ ఓ శాంతయ్య, ప్రధాన ఉపాధ్యాయులు జి హెచ్, ఎం దామెర శ్రీనివాస్ , వీరన్న రాజు జానయ్య, వెంకన్న, పుల్లయ్య, శ్రీనివాస్, రాజేశ్వరి, ఉపేంద్ర, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డికి పెందోట బాల సాహిత్య పురస్కారం



నవతెలంగాణ-చండూర్

స్థానిక చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి పెందోట బాల సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు శ్రీవాణి సాహిత్య పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు పెందోట వెంకటేశ్వర్లు తెలిపారు.2024 సంవత్సరానికి గాను బుచ్చిరెడ్డి బాలల కోసం రాసిన "బంతిపూలు 'కథల సంపుటి నల్లగొండ జిల్లా నుండి ఎంపిక చేయడం జరిగిందని తెలియజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి వివిధ విభాగాల కింద 13 మంది కవులు, రచయితలు ఎంపికైనట్లు వీరందరికీ త్వరలో సిద్దిపేటలో జరిగే సంస్థ పదో వార్షికోత్సవంలో నగదు, శాలువా, మెమోంటోలతో పురస్కారాన్ని అందజే యనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుచ్చిరెడ్డి పుంˆస్కారానికి ఎంపిక కావడం పట్ల పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎడ్ల బిక్షం, ఉపాధ్యాయులు, కవులు రచయితలు వివిధ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

500 రోజులుగా కొనసాగుతున్న ఉచిత స్టడీ హాల్

నవతెలంగాణ-నకిరేకల్



పట్టణంలోని వాసవి కాలేజీలో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్, వాసవి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత స్టడీ హాల్ 500రోజులుగా కొనసాగుతోంది. ఇక్కడ చదువుకున్న వారిలో ఇప్పటివరకు పోలీస్ కానిస్టేబుల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, గ్రూప్ 4, గురుకులం, నర్స్, ఉద్యోగాలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. చాలా మంది ఉద్యోగార్థులు గ్రూప్-1, టెట్ అర్హత సాధించారని పేర్కొన్నారు. రోజుకి 50 నుండి 60 మంది ఉద్యోగార్థులు స్టడీ హాల్ కు వస్తుంటారని, వీలున్న సమయంలో వచ్చి ఉచితంగా చదువుకోవచ్చని తెలిపారు. స్టడీ హాల్ ప్రారంభించి నేటికీ 500 రోజులు పూర్తి అయ్యిందని, అన్ని పోటీ పరీక్షలు పూర్తయ్యే వరకు స్టడీ హాల్ కొనసాగించనున్నట్లు నిర్వాహకులు బ్రహ్మదేవర నరేష్, కందగట్ల సందీప్ తెలిపారు.

కేంద్ర మంత్రి సంజయ్ కుమార్‌కు వినతి

నవతెలంగాణ-నకిరేకల్

వికలాంగులకు సామాజిక న్యాయం కల్పించేందుకు పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు 5 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించేలా చట్టం తీసుకురావాలని కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రి డా. వీరేంద్ర కుమార్, కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లను న్యూ ఢిల్లీలో కలసి వినతిపత్రం అందజేసినట్లు తెలంగాణ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గోలి ప్రభాకర్ తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో మహేశ్వరి, వెంకటేష్, శంకర్ తదితరులు ఉన్నారు.

నేటి నుండి ఆసరా పింఛన్ల పంపిణీ

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నేటి నుండి ఈనెల 21 వరకు ఆసరా పింఛలను పంపిణీ చేస్తున్నట్లు డిఆర్డిఎ పిడి నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేసే ఆసరా పింఛన్లను వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత, గీత, ఒంటరి మహిళలు తదితరులు సూచించిన తేదీల్లోగా పింఛన్లను పొందాలని పేర్కొన్నారు.



పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, టిపిపిఆర్‌పిఎ, ఆల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యను పెన్షనర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ పక్షాన సభ్యులు పాల్గొని పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ఎమ్మెల్యేకు వివరించారు.బ్యాంక్,ట్రెజరీ ఆఫీస్,పోస్ట్ ఆఫీస్, మండల ఆఫీస్, హాస్పిటల్స్ తమ సొంత పనులపై వచ్చి, చాలా ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారుల నుండి స్పందన కరువైందన్నారు. ఆలేరు నందు ఒక విశ్రాంతి గృహం ఉంటే, చాలా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.వృద్ధాప్య భారంగా ఉన్న పెద్దలు ఆలస్యమైనప్పుడు విశ్రాంతి తీసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని దరఖాస్తులో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి, బొమ్మ కంటి బాలరాజు, పి. రాజయ్య,రామానుజం, లక్ష్మీనారాయణ, యాదగిరి, ఆనందం తదితరులు ఉన్నారు.

అధిష్టానం ఏ పదవి ఇచ్చినా సంతృప్తిగా చేయడానికి సిద్ధం



- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్

కాంగ్రెస్ అధిష్టానం తనకు ఏ పదవి ఇచ్చినా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని ఊరచెరువు, పలు వార్డుల్లో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్లు, అండర్ డ్రయినేజీ నిర్మాణపనులు, మార్కండేయ దేవాలయం నుండి వలిగొండ ఎక్స్ రోడ్డు వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. త్వరలో పూర్తిచేయాలని పలు శాఖల అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా నాలాలపై నిర్మాణాలు చేపడితే వారం రోజుల్లోనే తొలగించి, డ్రయినేజీ నీరు పోయేట్లు చేయాలని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మునుగోడు ప్రజలు ఎదురుచూస్తున్న శుభవార్త తొందరలోనే వస్తుందని తాను అనుకుంటున్నానని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని రెండు లక్షల మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలవుతున్నాయని తెలిపారు. స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే వారికి ఐదు లక్షలు ప్రభుత్వం ఇస్తుందని, ఇంటి స్థలం లేని నిరుపేదలకు త్వరలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలాగా మాట ఇచ్చి తప్పే ప్రభుత్వం తమది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, మున్సిపల్ వైస్‌చైర్మెన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు గోపగోని లక్ష్మణ్, బండమీది మల్లేశం, కోరగోని లింగస్వామి, సందగల్ల విజయసతీశ్, పోలోజు శ్రీధర్‌బాబు, ఎంపీటీసీ సుర్వి రాజమ్మ, కాంగ్రెస్‌పార్టీ బ్లాక్, మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహాగౌడ్, బోయ దేవేందర్, నాయకులు ఉబ్బు వెంకటయ్య, చింతల సాయిలు, పిల్లలమర్రి శ్రీనివాస్, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, బొడిగె బాలకృష్ణగౌడ్, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, అంతటి బాలరాజు, ఉడుగు రమేశ్, వర్కాల రవి, మున్సిపల్, రెవెన్యూ ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.